


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 303, పేజీలు - 10

బుధవారం, ఏప్రిల్ 22, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# అజారుద్దీన్‌కు మంత్రి పదవి గండం

## కేబినెట్ మళ్లీ సిఫారసు చేసినా గవర్నర్ ఆమోదిస్తారా.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అందరి దృష్టి లోక్‌భవన్ వైపే ఉంది. మంత్రి మహ్మద్ అజారుద్దీన్, ప్రొఫెసర్ కోదండరాంల ఎమ్మెల్సీ నామినేషన్ల ఫైల్ క్లియరెన్స్ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో సీఎం ఆదివారం సమావేశం అయ్యారు. కానీ క్లారిటీ రాలేదు. దాంతో మరోసారి కేబినెట్ ద్వారా సిఫారసు చేయాలని అనుకుంటున్నారు.

### అజహర్ మంత్రి పదవి గండం గట్టెక్కుతుందా.?

తెలంగాణ కేబినెట్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న మహ్మద్ అజారుద్దీన్‌కు ఇప్పుడు సమయం చాలా తక్కువగా ఉంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం, మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆరు నెలల్లోపు శాసనసభ లేదా శాసనమండలిలో సభ్యత్వం పొందాల్సి ఉంటుంది. అజహర్ విషయంలో ఆ గడువు ఏప్రిల్ 30, 2026తో ముగియనుంది. అంటే పది రోజులు కూడా గడువు లేదు. ఎమ్మెల్సీగా ఖరారు కాకపోతే, మంత్రి పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇది కేవలం అజహర్ వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు, రేవంత్ రెడ్డి ప్రతిష్టకు కూడా ఒక సవాల్‌గా మారింది.

### గవర్నర్‌తో భేటీ - రేవంత్ రెడ్డి వ్యూహం

ఈ అంశంపై కొంతకాలంగా లోక్‌భవన్‌కు, ప్రభుత్వానికి మధ్య ఉన్న ప్రతిష్ఠంభనను తొలగించేందుకు రేవంత్ రెడ్డి సయోధ్య మార్గాన్ని ఎంచుకున్నారు. గవర్నర్‌తో జరిగిన భేటీలో ప్రొఫెసర్ కోదండరాం తెలంగాణ ఉద్యమ ప్రస్థానాన్ని, అజారుద్దీన్ విషయంలో ఉన్న రాజ్యాంగపరమైన అత్యవసర పరిస్థితిని సీఎం వివరించినట్లు తెలుస్తోంది. గతంలో గవర్నర్ కోటా నామినేషన్లపై కోర్టు కేసులు, సాంకేతిక అడ్డంకులు ఉన్నాయని ఇప్పుడు సుప్రీంకోర్టు నుండి కూడా సానుకూల సంకేతాలు ఉన్నాయని గవర్నర్‌కు తెలియజేశారు. రాజ్‌భవన్‌తో ఘర్షణ కంటే చర్చల ద్వారానే పనులు పూర్తి చేసుకోవాలనేది రేవంత్ మార్క్ వ్యూహంగా కనిపిస్తోంది.



### మళ్లీ కేబినెట్ ద్వారా సిఫారసు చేసేందుకు రెడీ

గతంలో సిఫారసు చేసినప్పుడు ప్రస్తుత గవర్నర్ లేరు. పాత గవర్నర్ ఉన్నప్పుడు కేబినెట్ చేసిన

2లో..

# ఖర్గే వ్యాఖ్యలపై దుమారం

- తమిళనాడులోని 234 స్థానాలకు ఒకే దశలో ఎన్నికలు
- ఎన్నికల ప్రచారానికి ఏప్రిల్ 23తో ముగిసిన గడువు
- మీడియా సమావేశంలో మోదీపై ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు





**చెన్నై (ప్రశ్న న్యూస్)** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలతో దుమారం రేగుతోంది. మంగళవారం ఆయన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ప్రధాని మోదీని "ఉగ్రవాది" అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆ పోలిక వెనుక ఉన్న సందర్భం గురించి ఒక విలేకరి అడిగితే.. "ప్రధాని మోదీ ప్రజలను, రాజకీయ పార్టీలను భయపెడుతున్నారు" అని ఖర్గే వివరణ ఇచ్చారు. అంతేకాక, తాను ప్రధానమంత్రిని ఎప్పుడూ 'ఉగ్రవాది' అని పిలవలేదని ఆయన అన్నారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్‌ను 'అర్బన్ నక్సల్ పార్టీ' అని

2లో..

# తెలంగాణలో యువత అంతా ఏమైంది.?

- 75 ఏళ్ల వ్యక్తి నవ యువకుడా? కేసీఆర్ సభపై కవిత సెటైర్లు
- యూత్ రాజకీయాల్లోకి రావాలంటూ జాగృతి అధ్యక్షురాలు పిలుపు
- తన పార్టీలో యువతకు ఉద్యమకారులకు పెద్దపీట వేస్తామని వ్యాఖ్య
- జీవన్ రెడ్డి చేరికపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టిన కవిత

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో నూతన శకానికి నాంది పలుకుతూ ఈ నెల 25వ తేదీన కొత్త రాజకీయ పార్టీని ప్రకటించబోతున్నట్లు కల్వకుంట్ల కవిత వెల్లడించారు. బుధవారం జరిగిన ప్రెస్‌మీట్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. యువతకే పెద్ద పీట వేస్తామని ప్రకటించారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీలు ప్రజల సమస్యలను విస్మరించి కేవలం బల ప్రదర్శన కే పరిమితమయ్యాయని విమర్శించారు. కాంగ్రెస్ పిట్ట కథలు, బిఆర్ఎస్ ఉట్టి కథలు చెబుతూ

2లో..



### రహస్య భేటీలు రేవంత్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య

- ఢిల్లీ టూర్‌పై హరీష్ రావు క్లారిటీ

2లో..



# నచ్చకున్నా మోదీనే ప్రధాని

- పీఎం హిందీకి తమిళనాడులో క్రేజ్ ఉందన్న చంద్రబాబు

**చెన్నై (ప్రశ్న న్యూస్)** భారత ప్రధాని నరేంద్ర మోదీ హిందీ స్పీచ్‌లను తమిళనాడు ప్రజలు ఎంతో ఆసక్తిగా చూస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. త్రిభాషా సూత్రానికి ఆంధ్రప్రదేశ్ మద్దతు తెలుపుతోందని, ప్రపంచ స్థాయిలో విజయం సాధించానికి అధిక భాషలు రావాలని అభిప్రాయపడ్డారు. తమిళనాడు ప్రజలపై హిందీని ఎవరూ రుద్దడం లేదన్నారు. మీకు నచ్చినా, నచ్చకపోయినా వచ్చే ఎన్నికల్లో, ఆ తరువాత ఎన్నికల్లోనూ మోదీనే భారత ప్రధాని అని కితాబిచ్చారు.తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా చెన్నైలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. త్రిభాషా సూత్రానికి తన మద్దతు ప్రకటించారు. పలు భాషలు నేర్చుకోవడంతో అంతర్జాతీయంగా అవకాశాలు ఉంటాయన్నారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో ఫుడ్, సాంస్కృతిక వైవిధ్యం, జీవన విధానం ఉంటాయని వాటిని గౌరవించాలని సూచించారు. గతంలో తమిళనాడు ఎన్నికల్లో డీఎంకే, ఏఐడీఎంకే పార్టీల మధ్య పోటీ ఉండేదని ఈసారి హిందీ భాష పై రాద్ధాంతం జరుగుతుందన్న విషయంపై చంద్రబాబు స్పందించారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నడూ హిందీని తప్పనిసరి చేయాలని లేదా జాతీయ భాషగా

2లో..



# ఇట్యాల ఇంటి ముందు "25" గ్రామాల రైతుల ఆందోళన

## - రైతుల ధనం దోచిన ధనుంజయ్, ధర్నాలో అన్నదాతలు

- మేడ్చల్ లో నాగర్ కర్నూల్ రైతులు ఆందోళన:పాశం
- 250 కోట్లు కొట్టేసిన వ్యక్తి ఇంటి ముందు ధర్నాకు దిగిన నాగర్ కర్నూల్ జిల్లా రైతులు
- మేడ్చల్ జిల్లా కుషాయిగూడ సుభాష్ నగర్లో నిందితుడు ఇంటి వద్ద వంట వార్పు, నిరసనలతో నినాదాలు 300 మంది రైతులతో భారీ ధర్నా.
- పాలమూరు రంగారెడ్డి జిల్లా ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతుల ధర్నా
- అధిక వడ్డీ,మాయమాటలతో మోసం చేసిన ఓం శ్రీ సాయి రాం ఫైనాన్స్ కంపెనీ.





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** అభం శుభం తెలియని అమాయక అన్నదాతలకు చుక్కలు చూపిస్తున్న మాయదారి మాయగాళ్ల. ఆరు నాళ్లు కష్టపడి పంటను పసిబిడ్డలా చూసుకుంటూ, చేతికి వచ్చిన తర్వాత మార్కెట్ కి తరలించే రైతన్నలకు టోకరా వేస్తున్న దొంగ కంపెనీలు తెలంగాణ రాష్ట్రంలో కోకొల్లలుగా కన్పిస్తున్నాయి.కోట్ల రూపాయలు కొల్లకోడుతూ అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఆర్థిక నేరస్థులను న్యాయస్థానాలు గట్టిగా బుద్ధి చెప్పాలని, భవిష్యత్తులో అన్నదాతలు జోలికి రాకుండా ఉండేవిధంగా తీర్పులు ఉండాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దేశంలో రైతన్న రాజు అంటూనే బికారి చేస్తున్న వారి పట్ల పాలకులు కూడా కొత్త చట్టాలతో ముందుకు రావాలని పలువురు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో నిన్న మంగళవారం ఉదయం మేడ్చల్ జిల్లాకుషాయిగూడలో నాగర్ కర్నూలు జిల్లా రైతుల ఆందోళన చేపట్టారు.పాలమూరు రంగారెడ్డి జిల్లా ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన అన్నదాతలు (రైతుల) ధర్నా నిర్వహించారు.అయితే 25 గ్రామాలకు చెందిన 2500 మంది రైతులకు సంబంధించిన 250 కోట్ల రూపాయలు కొల్లగొట్టిన ఓం శ్రీ సాయిరాం ఫైనాన్స్ సంస్థ.మోసపోయాము అని తెలుసుకున్న రైతుల బాధలు వర్ణనాతీతం. ఒక్కోక్కరిది ఒక్కోక్క ధీన గాథ. రైతులను మోసం చేసిన వ్యక్తి ధనుంజయ.కుషాయిగూడ సుభాష్ నగర్ లో ఉంటున్న నిందితుడు ధనుంజయ్ గుప్తా ఇంటి ముందు బైఠాయించి ధర్నాకు దిగిన రైతులు.బాధితులకు అండగా తెలంగాణ రాష్ట్ర సాధన పోరాట యోధుడు,రాజకీయ విశ్లేషకులు పాశం యాదగిరి సంఘీభావం తెలిపారు. అలాగే రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పాలమూరు రంగారెడ్డి జిల్లా ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు కింద నాగర్ కర్నూల్, కొల్హాపూర్ కు చెందిన భూమి కోల్పోయిన రైతులకు సంబంధించిన సుమారు 250 కోట్లు కొట్టేసిన ఘటన సంచలనం సృష్టించిన విషయం విదితమే. ముఖ్యంగా ఓం శ్రీ సాయిరాం ఫైనాన్స్ పేరుతో ఇట్యాల సాయిబాబా అనే ప్రధాన నిందితుడు ఇట్యాల ధనుంజయ్,ఇట్యాల బాలీశ్వర్,ఇట్యాల తుకారాం, నాగం కరుణాకర్ రెడ్డి,నాగం బుచ్చిరెడ్డి,రెవెల్లి జానకిరామ్ రెడ్డి,తాడురి శ్రీనివాస్ అనే వ్యక్తులతో కలిసి అక్షరాలా 250 కోట్ల భారీ కుంభకోణానికి పాల్పడ్డారని బాధిత రైతులుఆరోపించారు. వ్యవసాయం తప్ప మరేమీ తెలియని రైతులకు తక్కువ ధరలో భూములు ఇప్పిస్తానని,మంచి వడ్డీ ఇస్తామని నమ్మబలికి దాదాపు 25 గ్రామాలకు చెందిన 3000 మంది భూనిర్వాసితులు, రైతులకు సంబంధించిన సుమారు 250 కోట్ల నష్ట పరిహారం డబ్బులు కొల్లగొట్టారు ఇట్యాల కుటుంబ సభ్యులు, నాగం దొరలు.ఈ ఘరానా దొంగల చేతిలో మోసపోయాని గ్రహించిన రైతులు హై కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు నిందితుల ఆస్తులు జప్తు చేసినట్లు సమాచారం తెలుసుకున్న అన్నదాతలు. ఇరవై ఐదు గ్రాముల భూ నిర్వాసితులు కలిసి నిన్న మంగళవారం ఉదయం ధనుంజయ్ గుప్తా అనే నిందితుడు హైదరాబాద్ కుషాయిగూడ సుభాష్ నగర్ కాలనీలో ఉంటాడని తెలుసుకుని మంగళవారం 25 గ్రామాలకు చెందిన సుమారు 300 మంది బాధితులు నిందితుడి ఇంటిముందు బైఠాయించి మాకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు.ఈ సందర్భంగా బాధితులకు అండగా పాశం యాదగిరి నిలిచారు. ఆయన మాట్లాడుతూ భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని ఆర్.అండ్.ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని చట్టం ఉన్నా బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తుంగలో తొక్కుతున్నాయని పాశం యాదగిరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ధనుంజయ్ గుప్తా అనే నిందితుడిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.ఇంత జరుగుతున్నా ప్రభుత్వం, పోలీసులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఇలాంటి నిందితులను సంఘ బహిష్కరణ చేసి కాలనీ నుండి తరిమికొట్టాలని, సమాజం నుండి వెలివేయాలని డిమాండ్ చేశారు.బాధితులకు అండగా పౌరసమాజం నిలబడి అన్ని విధాలుగా న్యాయం చేయాలని అందరినీ మేలు కోల్పాలని పాశం యాదగిరి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.మరో విషయం ఏమిటంటే రైతులను మోసం చేసే ప్రతి ఒక్కరికీ బుద్ధి చెప్పాలని అన్నదాతల పక్షాన స్థానిక ప్రజలు సైతం ఆగ్రహం వ్యక్తంచేశారు.ఇంత పెద్ద మొత్తంలో రైతులు మోస పోవడం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇదే మొదటిసారి అని అందుకు రాజకీయ పార్టీలకు అతీతంగా అందరు ఏకమై అన్నదాతలకు మద్దతు పలకాలన్నారు పాశం యాదగిరి. మరో విషయం ఏమిటంటే సిఎం రేవంత్ రెడ్డి ఇలాకాలో ఇంత పెద్ద తప్పు జరిగితే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అసలు రైతులు భూమి కొల్పోతే దానికి బదులుగా ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా (క్యాష్ అవార్డు) ఇస్తే వాటిని సొంత పనులకు ఉపయోగించుకోకుండా, కోల్పోయిన భూమికి బదులు భూమి కొనుగోలు చేయాలనే ఆలోచననే చంపేశారు. పాపం ఏ పని తెలియని అన్నదాతలు కేవలం వ్యవసాయం తప్ప మరేమీ తెలియని ఈ రైతులకు ఇంత పెద్ద మోసం జరిగితే ఏ ఒక్క పార్టీ పెదవి విప్పక పోవడం శోచనీయమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా తెలంగాణ సమాజం నిద్ర లేచి రైతులు పక్షాన నిలబడే సమయం ఆసన్నమైంది.



# అజారుద్దీన్‌కు మంత్రి పదవి గండం

సిఫారసులు కొత్త గవర్నర్ ఆమోదిస్తారో లేదో క్లారిటీ లేదు. అందుకే సీఎం రేవంత్ మళ్లీ కేబినెట్ భేటీ ఏర్పాటు చేసి మరోసారి సిఫారసు చేయాలని అనుకుంటున్నారు. అప్పుడు గవర్నర్ నిర్ణయం తీసుకుంటారని అనుకుంటున్నారు. జూబ్లిహిల్స్ ఉపఎన్నికల సమయంలో మైనారిటీ నేతగా అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవడం ద్వారా రేవంత్ రెడ్డి ఒక పెద్ద రాజకీయ సందేశాన్ని ఇచ్చారు. ఇప్పుడు ఆయన పదవిని కాపాడలేకపోతే, అది ప్రభుత్వంపై, ముఖ్యంగా సీఎం నాయకత్వంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

### రేవంత్ వద్ద ప్లాన్ బీ ఉందా?

గవర్నర్ క్లియరెన్స్ రాకపోతే ప్లాన్–బి గా అజహర్‌ను మరోసారి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించడం లేదా హైకోర్టును ఆశ్రయించడం వంటి ఇతర ప్రత్యామ్నాయాలను కూడా ప్రభుత్వం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. అయితే, గవర్నర్ ఈ వారంలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటారని రేవంత్ ధీమాగా ఉన్నారు. ఈ వారం ముగిసేలోపు ఎమ్మెల్సీ విషయంలో స్పష్టత వస్తే రేవంత్ రెడ్డి రాజకీయంగా మరో విజయం సాధించినట్లవుతుంది. ఒకవేళ జాప్యం జరిగితే, ఏప్రిల్ 30 లోపు అజహర్ రాజీనామా చేయాల్సి రావడం ప్రతిపక్షాలకు ఒక బలమైన అస్త్రంగా మారుతుంది. అజహర్ మంత్రి పదవిని కాపాడటం ద్వారా తన పట్టును నిరూపించుకోవాలని చూస్తున్న రేవంత్ రెడ్డి, గవర్నర్ కోటా ఫైల్ పై సంతకం చేయించడంలో ఎంతవరకు సఫలమవుతారో చూడాలి.

# ఖర్గే వ్యాఖ్యలపై దుమారం

అభివర్ణించింది.తమిళనాడు ఎన్నికల్లో బీజేపీని తమ భాగస్వామిగా అన్నాడీఎంకే ఎంచుకోవడాన్ని ఖర్గే ప్రశ్నిస్తూ ప్రధానిని ఉద్దేశించి "ఉగ్రవాది" అనే పదాన్ని ఉపయోగించారు. " స్వయంగా అన్నాదురై ఫోటోను పెట్టుకునే అన్నాడీఎంకే వాళ్లు మోదీతో ఎలా చేరుతారు? ఆయన ఒక ఉగ్రవాది. ఆయన పార్టీ సమానత్వం, న్యాయాన్ని విశ్వసించదు. ఈ వ్యక్తులు వారితో కలుస్తున్నారు.. అంటే వారు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నారు, అన్నాదురై, కామరాజ్, పెరియార్, కలియజ్ఞర్, బాబా సాహెబ్ అంబేద్కర్ సిద్ధాంతాలను వారు బలహీనపరుస్తున్నారు" అని మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు."కాంగ్రెస్–డీఎంకే కూటమి సంక్షేమం, సమ్మిళిత వృద్ధి, నాణ్యమైన విద్య, అందుబాటులో ఉండే ఆరోగ్య సంరక్షణను అందించడం కొనసాగిస్తుంది" అని ఆయన నొక్కి చెప్పారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల బిల్లును ఓడించినందుకు కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. జాతినుద్దేశించిన ప్రసంగించిన ఆయన విపక్షాలు 'భ్రూణహత్య'కు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే నుంచి ఈ వ్యాఖ్యలు వచ్చాయి. ఖర్గేను "దయచేసి మీ వ్యాఖ్యను ఒక సందర్భానికి అన్వయించగలరా?" అని మీడియా అడిగితే "లేదు, లేదు" అన్నారు. "ఆయన (ప్రధాని మోదీ) ప్రజలను, రాజకీయ పార్టీలను భయపెడుతున్నారు. ఒక ఉగ్రవాది అని నేను ఎప్పుడూ అనలేదు నేను స్పష్టం చేయాలనుకుంటున్నది ఏమిటంటే, మోదీ ఎప్పుడూ బెదిరిస్తూనే ఉంటారు. ఈడీ, ఐటీ, సీబీఐ వంటి సంస్థలు ఆయన చేతుల్లో ఉన్నాయి. ఆయన నియోజకవర్గాల పునర్విభజనను కూడా తన చేతుల్లోకి తీసుకోవాలనుకుంటున్నారు. అందువల్ల ప్రజలను, రాజకీయ పార్టీలను ఆయన భయపెడుతున్నారని నేను అన్నాను. ఆయనను ఒక ఉగ్రవాది అని నేను ఎప్పుడూ అనలేదు" అని ఖర్గే అన్నారు. అయితే, ఈ వివరణకు బీజేపీ సంతృప్తి చెందలేదు. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23న పోలింగ్ జరగనుంది. దీంతో మంగళవారంతో ప్రచారం ముగిసింది.

# తెలంగాణలో యువత అంతా ఏమైంది.?

ప్రజలను మోసం చేస్తున్నాయని, ప్రజల అసలైన వెతలను పట్టించుకునే నాథుడే కరువయ్యారని మండిపడ్డారు. ఈ నెల 25న రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చే కార్యకర్తలకు, వాహనాలకు ఎలాంటి ఆటంకాలు కలిగించవద్దని ఆమె పోలీసు యంత్రాంగాన్ని కోరారు.

### కురువృద్ధులే యువకులైతే ఎలా?

జగిత్యాల బిఆర్ఎస్ సభలో 75 ఏళ్ల జీవన్ రెడ్డిని పార్టీలోకి చేర్చుకుంటూ ఆయనకు వయసు తగ్గిందని వ్యాఖ్యానించడంపై కవిత ఘాటుగా స్పందించారు. 75 ఏళ్ల కురువృద్ధులే నవ యువకులైతే, వారే తెలంగాణకు దిక్కు అంటే.. మరి రాష్ట్రంలోని యువత పరిస్థితి ఏంటి? వారంతా చచ్చిపోయారా? అని ఆమె ప్రశ్నించారు. తెలంగాణలో యువతకు కొరత లేదని, కానీ పార్టీలు వారికి అవకాశాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. తన కొత్త పార్టీలో యువ రక్తానికి ప్రాధాన్యత ఉంటుందని, రాజకీయాల్లో ఒక గొప్ప మార్పును తీసుకువస్తానని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

### బీఆర్ఎస్ తీరుపై తీవ్ర విమర్శలు

బీఆర్ఎస్ పార్టీలో మహిళలకు ఎప్పుడూ గౌరవం ఉండదని, వేయి ఏళ్లయినా ఆ పార్టీ తీరు మారదని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో ఓటమికి ప్రజలను బ్లేమ్ చేయడం కేసీఆర్ అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులను విస్మరించడమే కాకుండా, వారు భిక్షాటన చేస్తారంటూ అవమానకరంగా మాట్లాడటం సరికాదన్నారు. మహిళా బిల్లు, డీలిమిటేషన్ వంటి కీలక అంశాలపై బిఆర్ఎస్ సభలో ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం ఆ పార్టీ ద్వంద్వ విధానాలకు నిదర్శనమని ధ్వజమెత్తారు.

### రేవంత్ రెడ్డిపై ధ్వజం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరును కూడా కవిత తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణలో ప్రతిపక్షం లేకుండా చేయడానికి రేవంత్ రెడ్డి ఎవరని ప్రశ్నించారు. వచ్చే పదేళ్ల పాటు తానే సీఎంనని చెప్పుకోవడం ప్రజలను కించపరచడమేనని, ఆ విషయాన్ని ప్రజలే ఓటు ద్వారా నిర్ణయిస్తారని గుర్తు చేశారు. కోర్టు తీర్పులను ప్రభావితం చేసేలా సీఎం మాట్లాడటం రాజ్యాంగ విరుద్ధమని ఆక్షేపించారు. రేవంత్ రెడ్డి లోపాయికారీగా గుంట నక్క లతో డీల్స్ మాట్లాడుతున్నారని, తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెడుతున్నారని ఆరోపించారు.

### ఆర్టీసీ సమ్మెకు మద్దతు

రాష్ట్రంలో నెలకొన్న నీటి ఎద్దడి, కరెంట్ కోతలు, ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం ఉదాసీనంగా ఉందని కవిత మండిపడ్డారు. ఆర్టీసీని ప్రైవేటు పరం చేసే కుట్ర జరుగుతోందని, తక్షణమే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్న కార్మికులకు తన సంపూర్ణ మద్దతు ప్రకటించిన ఆమె, ఆర్టిజన్లను బెదిరించి సమ్మె విరమింపజేయడం దారుణమన్నారు. ఒక ఆడబిడ్డగా, కొత్త తరహా రాజకీయాలతో ప్రజల సెంట్రిక్ ఎజెండాతో ముందుకు వస్తున్నానని, తనను ఆశీర్వదించాలని తెలంగాణ ప్రజలకు కవిత విజ్ఞప్తి చేశారు.

# రహస్య భేటీలు రేవంత్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఏడాది తర్వాత బయటికి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జగిత్యాల వేదికగా బీఆర్ఎస్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన వేళ ఆ పార్టీ కీలక నేత, మాజీ మంత్రి హరీష్ రావు హుటాహుటిన ఢిల్లీకి వెళ్లడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై నస్తూర్‌పల్లి సభలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ హైకోర్టు తీర్పు నేపథ్యంలో బీజేపీ పెద్దల కాళ్లు పట్టుకుని లాబీయింగ్ చేసేందుకే హరీష్ రావు ఢిల్లీకి వెళ్లారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఢిల్లీలో స్పందించిన హరీష్ రావు రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు.రేవంత్ రెడ్డికి అక్కసు, కడుపుమంట తప్ప మరేమీ లేవని హరీష్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. తాను ఢిల్లీలో పర్యటించడంపై సీఎంవో నుంచి వస్తున్న వార్తలను హరీష్ రావు ఖండించారు. తన ఢిల్లీ టూర్‌పై వచ్చిన లీకులను హరీష్ రావు తీవ్రంగా కొట్టిపారేశారు. తన ఢిల్లీ పర్యటనలో ఎలాంటి రహస్యాలు లేవని మండిపడ్డారు. ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసుకు సంబంధించి న్యాయ నిపుణులతో చర్చించేందుకే తాను ఢిల్లీకి వచ్చినట్లు తేల్చి చెప్పారు. తాను అందరూ చూస్తుండగానే శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి విమానం ఎక్కినట్లు స్పష్టం చేశారు. అంతే తప్ప దొంగచాటుగా వెళ్లలేదని తెలిపారు. ఇక బుధవారం రోజున సుప్రీంకోర్టులో ఓటుకు నోటు కేసు విచారణలో ఉందని అందులో బీఆర్ఎస్ పార్టీ ఇంప్లీడ్ అయిన విషయాన్ని హరీష్ రావు గుర్తు చేశారు.రహస్య భేటీలు కావడం తనకు అలవాటు లేదని రేవంత్ రెడ్డిపై హరీష్ రావు ఎదురుదాడి చేశారు. రాత్రి రాహుల్ గాంధీని కలిసిన రేవంత్ రెడ్డి తెల్లవారుజామునే కేంద్ర మంత్రులు, బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలను కలిశారని గుర్తు చేశారు. ఇలా రహస్య భేటీలు చేయడం రేవంత్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అని హరీష్ రావు విమర్శలు గుప్పించారు. తన పర్యటనలపై పనిలేని వారే అసత్యాలు ప్రచారం చేస్తున్నారని హరీష్ రావు ఆరోపించారు. ఇక జగిత్యాల, నస్తుర్‌పల్లిలో మాజీ సీఎం, సీఎం సభలపై స్పందించిన హరీష్ రావు కేసీఆర్ మాట్లాడే సమయానికే మాట్లాడడం వల్ల రేవంత్ రెడ్డి స్థాయి ఏంటో ప్రజలకు అర్థమైందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రసంగాన్ని 36 లక్షల మంది చూస్తే రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని 4 లక్షల మంది చూశారంటే అది 10 శాతం కూడా కాదని హరీష్ రావు పేర్కొన్నారు.

# ప్రభుత్వంతో ఆర్టీసీ చర్చలు విఫలం

## – అర్ధరాత్రి నుంచి సమ్మె, డిపోలకే పరిమితం కానున్న బస్సులు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రభుత్వంతో టీజీఎస్‌ఆర్టీసీ జేఏసీ నేతలు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. దీనితో ఈరోజు అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగనున్నట్లు జేఏసీ నాయకులు ప్రకటించారు. ఐఏఎస్ అధికారుల కమిటీతో జేఏసీ నేతలు చర్చలు జరిపారు. ఈ క్రమంలో డిమాండ్లపై ప్రభుత్వానికి నాలుగు వారాల సమయం ఇవ్వాలని జేఏసీ నేతలను కమిటీ కోరింది. అప్పటి వరకు సమ్మెను విరమించుకోవాలని కోరింది. అయితే ఐఏఎస్ అధికారుల కమిటీ విజ్ఞప్తిని జేఏసీ నాయకులు అంగీకరించలేదు. తమ డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. చర్చల అనంతరం జేఏసీ నాయకులు మాట్లాడుతూ, తమ సమస్యలను ఐఏఎస్ అధికారుల కమిటీకి వివరించామని తెలిపారు. వారు నాలుగు వారాల గడువు కోరారని, కానీ తమ డిమాండ్లు కొత్తవి కావని వెల్లడించారు. గతంలో ఇచ్చిన హామీలనే తాము అడుగుతున్నామని అన్నారు. తమ మాట విని నాలుగు వారాలు ఆగాలని కమిటీ కరాఖండిగా చెప్పిందని, దీనితో తప్పనిసరి పరిస్థితుల్లో తాము సమ్మెకు వెళుతున్నామని తెలియజేశారు. 32 డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు తాము సమ్మెను కొనసాగిస్తామని వెల్లడించారు.

### ప్రయాణికులకు ఇబ్బందులు తప్పవా?

టీజీఎస్‌ఆర్టీసీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ అర్ధరాత్రి నుంచి సమ్మె జరగనుంది. ఈ సమ్మెలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా బస్సులు నిలిచిపోనున్నాయి. ప్రతిరోజూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే దాదాపు లక్షలాది మంది ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ముఖ్యంగా హైదరాబాద్, వరంగల్ వంటి ప్రధాన నగరాల్లో సామాన్య ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. మరోవైపు ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### సమ్మె విరమించాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

ఇదిలా ఉంటే టీజీఎస్‌ఆర్టీసీ జేఏసీ సమ్మె విరమించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని, అందుకే అధికారుల కమిటీని నియమించామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిపోల వద్ద పోలీసులు భారీగా మోహరించారు.

# నచ్చకున్నా మోదీనే ప్రధాని

రుద్దలేదని, ప్రజలు స్వచ్ఛందంగానే నేర్చుకుంటున్నారని స్పష్టం చేశారు.

### ప్రధాని మోదీ హిందీ స్పీచ్‌లకు తమిళనాడులో క్రేజ్

ఏపీ ప్రభుత్వం త్రిభాషా సూత్రానికి సంపూర్ణ మద్దతు తెలుపుతోంది. మాతృభాష తెలుగుతో పాటు ఇతర భాషలకు ప్రాధాన్యం కల్పిస్తున్నాం. ఇంకా చెప్పాలంటే ప్రధాని నరేంద్ర మోదీ హిందీలో చేసే ప్రసంగాలను ఇప్పుడు తమిళనాడులో ఎక్కువగా చూస్తున్నారు. ఇంగ్లీష్ ముఖ్యమే అయినప్పటికీ, తెలుగు వంటి మాతృ, ప్రాంతీయ భాషలను రక్షించుకోవాలి. తమిళులతో సహా ప్రజలు వివిధ ప్రాంతాలకు, దేశాలకు వెళ్తున్నప్పుడు క్రమంగా ఒకటి కంటే ఎక్కువ భాషలను నేర్చుకుంటున్నారు. అధిక భాషలు నేర్చుకుంటే మనకు ఉపాధి అవకాశాలు సైతం పెరుగుతాయి. అవకాశాలను మెరుగుపరచడానికి ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాలలో జర్మన్, జపనీస్, ఫ్రెంచ్ వంటి అంతర్జాతీయ భాషలను ప్రోత్సహిస్తున్నాం. ప్రపంచీకరణ చెందుతున్న నేటి ప్రపంచంలో ఎక్కువ భాషలు తెలిసి ఉండటం వల్ల పోటీతత్వంలో మీకు ప్రయోజనం కలుగుతుంది.

### ఇప్పుడు ఉన్నది ఒకటే ఇజం టూరిజం..

'ప్రపంచం ఒక గ్లోబల్ మార్కెట్‌గా మారింది. పాత ఆలోచనలు, సంకుచిత మనస్తత్వం నుంచి బయటకు రావాలి. ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రజల్లో నమ్మకం బలంగా ఉందని, భవిష్యత్ ఎన్నికలలో కూడా ఆయన అధికారంలోకి వస్తారు. మీకు ఇష్టం ఉన్నా, లేకున్నా ఆయనే విజయాలు సాధించి ప్రధానిగా కొనసాగుతారు. అభివృద్ధికి మార్పులకు అనుగుణంగా మారాలి. విశాల దృక్పథంతో ఆలోచించాలి. పెట్టుబడిదారీ విధానం, సోషలిజం, కమ్యూనిజం వంటి సాంప్రదాయ భావజాల విభజనలు క్రమంగా ప్రాముఖ్యతను కోల్పోయాయి. ప్రస్తుతం కేవలం టూరిజం మాత్రమే ప్రాధాన్యత కలిగిన రంగమని' చంద్రబాబు వ్యాఖ్యానించారు.భారత్‌లో వైవిధ్యాన్ని, భిన్నత్వంలో ఏకత్వాన్ని కొనియాడుతూ ఒక్కో రాష్ట్రంలో ఒక్కో సంప్రదాయం ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెసరట్టు, పొంగల్, హైదరాబాద్ బిర్యానీ ఫేమస్. చెన్నైకి వచ్చినప్పుడు నేను ఇడ్లీ సాంబార్ ఇష్టంగా తింటానని తెలిపారు. విభిన్న సంస్కృతులు, భాషలు, సంప్రదాయాలే దేశానికి బలమని పేర్కొన్నారు. ఈ వైవిధ్యమే ప్రపంచ పర్యాటకానికి ప్రధాన ఆకర్షణగా నిలిచిందని అభివృద్ధి వైపు అడుగులు వేయాలి. కానీ భాషలపై వ్యతిరేకత, ప్రాంతాలపై వ్యతిరేకత లాంటివి మానుకోవాలని చంద్రబాబు సూచించారు.

# కేరళ బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు

- 13 మంది సజీవదహనం, 40 మందికి గాయాలు
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల పరిహారం ప్రకటించిన ప్రధాని
- గాయపడిన వారికి రూ. 50,000 ఆర్థిక సహాయం




తిరువనంతపురం (ప్రశ్న న్యూస్) కేరళలోని ఓ బాణా సంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించింది. త్రిస్సూర్ జిల్లా ముండతికోడ్‌లో జరిగిన ఈ ప్రమాదంలో కనీసం ఆరుగురు కార్మికులు ఘటనా స్థలిలోనే సజీవదహనమయ్యారు. ఆసుపత్రిలో చికిత్స పొందూ మరో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదంలో మరో 40 మందికిపైగా గాయపడ్డారు. వీరిలో ఎనిమిది మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో ఈ పేలుడు జరిగినట్టు అధికారులు తెలిపారు. త్రిస్సూర్‌లో జరిగే తిరువంబాడి పూరం ఉత్సవాల కోసం బాణసంచాను సిద్ధం చేస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పేలుడు శబ్దానికి చుట్టుపక్కల ప్రాంతాల వారు భూకంపం వచ్చిందేమోనని ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఘటనా స్థలిలో శరీర భాగాలు చెల్లాచెదురుగా పడి, భీతావాహ వాతావరణం నెలకుంది. ఈ దుర్ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ప్రధాని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రధాని జాతీయ సహాయ నిధి (పీఎంఎన్‌ఆర్ఎఫ్) నుంచి మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.ప్రమాద సమయానికి అక్కడ సుమారు 50 మంది కార్మికులు ఉన్నట్టు భావిస్తున్నారు. ఘటన గురించి సమాచారం అందగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స కోసం అంబులెన్సుల్లో ఆసుపత్రికి తరలించారు. అగ్నిమాపక శకటాలతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దాదాపు రెండు ఎకరాల పొలంలో షెడ్డు వేసి బాణసంచాను నిల్వ ఉంచారు. ఘటనపై కేరళ ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ స్పందించారు. గాయపడినవారికి మెరుగైన వైద్యం అందించాలని, మెడికల్ కాలేజీలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ఘటనా స్థలానికి అదనపు అంబులెన్సులను పంపాలని మంత్రి ఆదేశించారు.భారీ ఎత్తున మంటలు వ్యాపించడంతో సహాయక చర్యలకు ఆటంకంగా మారింది. ఆ ప్రాంతంగా పొగలు వ్యాపించడంతో రెస్క్యూ సిబ్బంది.. ఆ ప్రదేశానికి చేరుకోడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇదిలా ఉండగా, దీనికి రెండు రోజుల ముందే తమిళనాడులోని విరుద్‌నగర్‌లో బాణా సంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించి, 25 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో పదుల సంఖ్యలో గాయపడ్డారు. కట్టనార్‌పట్టిలోని ముత్తుమనిక్కం అనే వ్యక్తికి చెందిన 'వనజ' బాణసంచా కర్మాగారంలో ఈ పేలుడు సంభవించింది. ఇటీవలి సంవత్సరాలలో ఈ ప్రాంతంలో జరిగిన అత్యంత ఘోరమైన విపత్తులలో ఈ ప్రమాదం ఒకటి. వాచకరపట్టి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండే ఈ తయారీ యూనిట్‌కు నాగ్‌పూర్‌లోని పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (పేసో) నుంచి లైసెన్స్ ఉన్నట్లు సమాచారం. త్రిసూర్ ఘటనపై ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించింది. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేశారా? ప్రమాదవశాత్తూ జరిగిందా? అనేది తెలియాల్సి ఉంది. విచారణలో వాస్తవం ఏంటి? అనేది బయటపడుతుంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టారు.

## తెలంగాణలో ఉద్యోగుల బదిలీలకు

# గ్రీన్‌సిగ్నల్

## – ఒకేచోట 3 ఏళ్లు పనిచేసిన వారికి ట్రాన్స్‌ఫర్లు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో బదిలీల కోసం చాలా కాలం నుంచి వేచి చూస్తున్న ఉద్యోగులకు రేవంత్ రెడ్డి సర్కార్ తీపి కబురు అందించింది. ఉద్యోగుల బదిలీలపై ఇప్పటివరకు ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో ఉద్యోగుల బదిలీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జీవో విడుదల చేశారు. మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రంలోని అర్హులైన ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్లకు అనుమతులు కల్పించింది. 3 ఏళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది.తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై నిషేధం ఎత్తివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో, ప్రభుత్వోద్యోగుల బదిలీలకు లైన్ క్లియర్ అయ్యింది. ఈ క్రమంలో మే ఒకటో తేదీ నుంచి 31 వరకు ఉద్యోగుల బదిలీకి అనుమతి ఇచ్చింది. ఒకేచోట మూడేళ్లు దాటిన వారు బదిలీ కావడానికి అనుమతిని మంజూరు చేసింది. కాగా, రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియపై సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది.గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బదిలీల ఫైల్‌పై తాజాగా సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించడంతో అధికారిక ఉత్తర్వులు వెల్లడి అయ్యాయి. చివరిసారిగా 2024లో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు జరిగాయి. అదే సమయంలో ఒకేచోట 4 ఏళ్లు పని చేసిన ఉద్యోగులను తప్పనిసరిగా ట్రాన్స్‌ఫర్ చేయనున్నారు. అయితే గరిష్ఠంగా 40 శాతం మంది ఉద్యోగులను మాత్రమే బదిలీ చేయనున్నారు. ఇక సచి?వ్జ్, మెడికల్, డిసెబిలిటీ ఉన్నవారికి ఈ బదిలీల్లో ప్రాధాన్యత కల్పించనున్నట్లు జీవోలో ప్రభుత్వం పేర్కొంది.

## 25 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి

# చిక్కిన ఆర్డీవో రామచంద్రనాయక్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ అధికారులు లంచం ఒక సాధారణమైన విషయంగా మారింది. ఏసీబీ అధికారులు దాడులు చేస్తున్న అవినీతి అధికారులు అసలు లెక్క చేయడం లేదు లంచం తీసుకోవడమే ధర్మంగా వ్యవహరిస్తూ ప్రజలను పీడిచి పిప్పి చేస్తున్నారు. నారాయణపేటలో అవినీతి బారిన పడిన అధికార వ్యవస్థ మరోసారి వెలుగులోకి వచ్చింది. ఆర్డీవో రాంచందర్ నాయక్ రూ.25,000 లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డిఎస్పీ బాలక్రిష్ణయ్య ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంపై అకస్మాత్తుగా దాడులు నిర్వహించి, లంచం స్వీకరిస్తున్న సమయంలోనే ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం కార్యాలయంలో సోదాలు కొనసాగుతున్నాయి. సంబంధిత పత్రాలు, నగదు లావాదేవీలపై అధికారులు సవివరంగా దర్యాప్తు చేస్తున్నారు.ఇది జరగడం యాదృచ్ఛికం కాదు గాని, నేడు జాతీయ సివిల్స్ సర్వీసు దినోత్సవం రోజునే ఈ ఘటన వెలుగులోకి రావడం గమనార్హం. ప్రజా సేవ, పారదర్శకత, జవాబుదారీతనం వంటి విలువలను గుర్తుచేసే రోజునే అవినీతి ఆరోపణలు రావడం ప్రభుత్వ యంత్రాంగంపై మచ్చగా మారింది. ఈ ఘటనపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు

## కార్యకర్తలే పార్టీలకు బలం, విస్మరిస్తే పార్టీకి దూరం:ఆర్కే



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళ బిల్లుతోపాటు డేలిమిటేషన్ బిల్లు పై ప్రతిపక్షాలు వీగేలా చేయడం వారి మూర్ఖత్వానికి పరాకాష్ట అని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ నిన్న మంగళవారం మహేంద్ర హిల్స్ లో ఉన్న భాజపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయడంతో పాటు ప్రజా ప్రతినిధుల ప్రాతినిధ్యాన్ని పెంచే విధంగా తీసుకువచ్చిన డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ ప్రతిపక్షాలు చారిత్రాత్మక తప్పిదం చేశాయని అన్నారు. మహిళల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరిస్తూ వారికి చట్టసభల్లో గౌరవం కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలకు ప్రతిపక్షాలు మద్దతుగా నిలవకపోవడం మహిళల పట్ల వారికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. మహిళా డిలీమిటేషన్ బిల్లుల అంశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా ప్రజలను నమ్మకద్రోహం చేసిన పార్టీగా కాంగ్రెస్ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కార్యకర్తలే ప్రతి పార్టీకి పట్టుకొమ్మలుగా ఉంటూ గత కొన్నేళ్లుగా పార్టీకి సేవ చేస్తున్నారని ఆయన అన్నారు.డీలిమిటేషన్ బిల్లు ఆమోదం పొంది ఉంటే వారికి పుష్కలంగా అవకాశాలు లభించేవని,ప్రతి పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులతో మాట్లాడి ఈ బిల్లు సాధించేందుకు ప్రత్యేకంగా జేఏసీ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.ప్రజా జీవితంలో సంవత్సరాల పాటు పని చేసిన వారికి ప్రాతినిధ్యం కల్పించాలంటే అన్ని పార్టీల నుండి కార్యకర్తల స్థాయి నాయకులు ఒక్కటైతే ఈ బిల్లుకు మోక్షం లభించే అవకాశం ఉంటుందని ఆర్కే ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే ప్రాంతీయ, జాతీయ పార్టీల జెండాలు జీవిత కాలం మోసి, ఒక్క పదవి కూడా అనుభవించకపోతే ఎం లాభం,అందుకనే పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల కార్యకర్తలు ఏకమై ముందుకు సాగుతే, అందరి జీవితాల్లో వెలుగులు నిండుతాయి.లేకపోతే ప్రస్తుతం సమాజంలో ఉన్న ప్రాంతీయ జాతీయ పార్టీల నేతలు వారివారసత్వాన్ని పెంచి పోషిస్తున్నారు. వారి అడుగులకు మడుగులకుమనం బానిసలం అవుదామా,లేక బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో మన స్థానాన్ని వెతుకుందామా,ఇది అందరితో మాత్రమే సాధ్యం. కలిసి వస్తే ముందుకు పోదాం, లేకపోతే కన్నీళ్లతో జీవితాంతం కండువాలు మోదామా అని ఆయన ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో భాజపా సీనియర్ నాయకులు టోపి శంకర్, జే.వీ.నర్సింగ్ రావు, సతీష్, జైపాల్ రాకేష్, అరుణ్, సచ్చిన్, టింకు, ప్రశాంత్, దయానంద్, కనకరాజ్, విజయ్, వీరవర్ధన్, విశాలినీ, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల స్వరూపమే గురువుబిఎన్ సీ సంతోష్



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బూరుగుపల్లి గ్రామంలో ఉపాధ్యాయునిగా సేవలందించిన ఎగ్గిడి శ్రీశైలం ఉద్యోగ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ సీ సంతోష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్ సీ సంతోష్ మాట్లాడుతూ, "గురువు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల స్వరూపం" అని పేర్కొంటూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని అన్నారు. సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకమని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే మహత్తర బాధ్యత ఉపాధ్యాయులదని వివరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మహిళా అధ్యక్షురాలు శైలజ, ఉపాధ్యాయుడు మరియు పత్రిక సంపాదకుడు జైపాల్ రెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, అహ్మదిపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బ్రహ్మాండ్లపల్లి బిక్షపతి, పీఆర్టీయూ ఉపాధ్యాయులు, పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వర్గల్ క్షేత్రంలో

### వైభవంగా శంకర జయంతి మహోత్సవం

**ప్రత్యేక పూజలు చేసిన సరస్వతి పుత్రులు, సిద్ధాంతి చంద్రశేఖర శర్మ**



గజ్వేల్(ప్రశ్న న్యూస్) ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో మంగళవారం శంకర జయంతి మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. సరస్వతీ పుత్రులు, వాస్తు సిద్ధాంతి, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు ఆది శంకరుడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సిద్ధాంతి చంద్రశేఖర శర్మ మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షకులు ఆదిశంకరాచార్యుడి బోధనలు ప్రతి ఒక్కరిని ఆధ్యాత్మిక భావన వైపు నడిపించినట్లు స్పష్టం చేశారు. నాస్తికత్వాన్ని రూపుమాపి సనాతన ధర్మం, వేద మార్గాన్ని ఆయన పునరుద్ధరించినట్లు గుర్తు చేశారు. ముఖ్యంగా జ్ఞాన పీఠాల స్థాపనతో భిన్నమైన ఆరాధనలు ఒకే పరమాత్మను చేరనున్నట్లు ఆదిశంకరులు ప్రపంచానికి చాటి చెప్పినట్లు వివరించారు. శంకర జయంతి సందర్భంగా బ్రహ్మశ్రీ, సిద్ధాంతి చంద్రశేఖర శర్మను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

# రైతులకు లాభదాయక పంటగా ఆయిల్ పామ్ సాగు శ్రేయస్కరం

**- హార్టికల్చర్ శాఖ అధికారి**





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని మర్లపేట గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఆయిల్ పామ్ సాగు అవగాహన కార్యక్రమంలో హార్టికల్చర్ శాఖ అధికారి, ఏరియా మేనేజర్, ఫ్యాక్స్ సీఈఓలు రైతులను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఆయిల్ పామ్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా లాభదాయకమైన పంటగా నిలుస్తుందని తెలిపారు. తక్కువ శ్రమతో ఎక్కువ ఆదాయం పొందే అవకాశముందని, ప్రభుత్వం కూడా ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు.నాణ్యమైన నాట్ల ఎంపిక, సరైన నీటి పారుదల, ఎరువుల వినియోగం వంటి అంశాల్లో శాస్త్రీయ విధానాలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని సూచించారు. అలాగే మార్కెటింగ్ విషయంలో ఎటువంటి ఇబ్బందులు ఉండవని, ఫ్యాక్స్ ద్వారా రైతులకు పూర్తి మద్దతు అందిస్తామని తెలిపారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్ పామ్ సాగును కూడా స్వీకరించి ఆదాయాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొని తమ సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు.

## గజ్వేల్‌లో ఘనంగా "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన ర్యాలీ



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ మార్గదర్శకాల మేరకు "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్లు, గజ్వేల్ పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన ర్యాలీని నిర్వహించారు.ఈ ర్యాలీ ప్రజల్లో ట్రాఫిక్ నియమాల పాటింపు, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వినియోగం, రోడ్డు భద్రతపై అవగాహన పెంపు లక్ష్యంగా చేపట్టారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనితా అబ్రహం అధ్యక్షత వహించగా, వైస్ ప్రిన్సిపల్ కమల క్రిష్ణియానా, డా. కె. ఉమారాణి, ఐక్యూఏసీ సమన్వయకర్త శ్రీమతి ఎం. లక్ష్మి పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. పి. సౌజన్య, డా. కె. సరోజా ర్యాలీ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. గజ్వేల్ సి.ఐ రవికుమార్, పోలీసు సిబ్బంది పాల్గొని, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని ప్రజలకు సూచించారు.ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్లకార్డులు ప్రదర్శిస్తూ రోడ్డు భద్రతపై నినాదాలు చేశారు. గజ్వేల్ పట్టణంలోని ముఖ్య వీధుల గుండా ర్యాలీ సాగి ప్రజల్లో చైతన్యం కలిగించింది.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ఇటువంటి అవగాహన కార్యక్రమాలు రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో మరియు బాధ్యతాయుత పౌర సమాజ నిర్మాణంలో కీలకమని తెలిపారు.చివరగా విద్యార్థులు, అధ్యాపకులు, పోలీసు అధికారుల సమిష్టి భాగస్వామ్యంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. "రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత" అనే సందేశాన్ని ర్యాలీ బలంగా చాటిచెప్పింది.

## వికారాబాద్ ఉమెన్స్ పోలీస్ స్టేషన్‌లో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సీఐ, ఎస్ఐ

**బెయిల్ కోసం 60000 డిమాండ్ 40 వేల కుదిరిన ఒప్పందం**

**సీఐ సరోజ ఎస్సై రాణి తో సహా ముగ్గురిని పట్టుకున్నవైనం**

**ఇటీవల పోలీస్ శాఖలో భారీగా పెరిగిన అవినీతి**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఇటీవల పోలీసు శాఖలో లంచాల వ్యవహారం భారీగా పెరిగింది హోంగార్డు నుండి ఉన్నతాధికారి వరకు లంచాలు తీసుకొని అక్రమాలకు అవినీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు తీవ్రంగా వెలువెత్తుతున్నాయి. పోలీస్ స్టేషన్లో జరిగిన సంఘటనలు బయటకు రాకుండా ప్రజల వద్ద నుండి ఫోన్లు తీసుకుని వాళ్ళిద్దరూ భాషలాడుతూ అనేక అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వికారాబాద్ ఉమెన్స్ పోలీస్ స్టేషన్‌లో కుటుంబ గొడవల నేపథ్యంలో ఇర్షాద్ అనే వ్యక్తిపై, ఆయన కుటుంబ సభ్యులపై 498ఏ కింద కేసు నమోదు చేసి, స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి లంచం డిమాండ్ చేసిన అధికారినిలు సీఐ, ఎస్ఐ.ఇర్షాద్ కుటుంబసభ్యులకు ఆరుగురికి స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున రూ.60,000 లంచం డిమాండ్ చేసినారనిరూ.40,000 లంచం ఇవ్వడానికి ఒప్పందం జరిగి, రూ.20,000 సీఐకి, ఎస్ఐకి బాధితుడు ఇచ్చాడు.మిగతా రూ.20,000 విషయంలో బాధితుడు ఇర్షాద్ సమాచారం ఇవ్వడంతో సీఐ సరోజ, ఎస్ఐ రాణితో సహా మరో ముగ్గురిని ఆధారాలతో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. పోలీసు శాఖలో ఎస్సైలు సిఐలు భారీగా లంచాలు తింటున్నారని ప్రతి పోలీస్ స్టేషన్ విషయంలో ఇదే వ్యవహారం జరుగుతుందన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి.

## పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు కో-ఆప్షన్ మెంబర్‌గా గౌరవం కల్పించాలి




గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో బిఆర్ఎస్ పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్యకర్తలను గుర్తించి, వారికి తగిన గౌరవం ఇవ్వాలని కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన కార్యకర్తలను కో-ఆప్షన్ మెంబర్లుగా నియమించాలని కోరుతున్నారు.ఈ మేరకు సిద్దిపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఇతర పార్టీ పెద్దలు ముందుకు వచ్చి అర్హులైన కార్యకర్తలను ఎంపిక చేసి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్లుగా నియమించాలని కార్యకర్తలు విజ్ఞప్తి చేస్తున్నారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి అవకాశాలు కల్పించడం ద్వారా వారి సేవలను గుర్తించడమే కాకుండా, ఇతర కార్యకర్తలకు కూడా ప్రోత్సాహం లభిస్తుందని వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## పౌర హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**- సమానత్వం కోసం పోరాటం కొనసాగాలి**

**- నర్సింగాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ఉపాధ్యక్షులు**

**: లింగంపల్లి శ్రీనివాస్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, నర్సింగాపూర్ గ్రామశాఖ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు లింగంపల్లి శ్రీనివాస్ జాతీయ పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ పౌరుల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రతి పౌరునికి సమానంగా అందాలని,వాటి అమలులో ఎలాంటి వివక్ష ఉండకూడదని పేర్కొన్నారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలను పరిరక్షించుకోవాలని ఆయన సూచించారు. గ్రామీణ స్థాయిలో పౌర హక్కులపై మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా అణగారిన వర్గాలకు చట్టపరమైన హక్కులపై చైతన్యం కల్పించాలని తెలిపారు.ప్రస్తుత సమాజంలో ఇంకా కొన్ని చోట్ల హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, వాటిని అరికట్టేందుకు ప్రభుత్వ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు తమ హక్కులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉంటేనే సమాజంలో నిజమైన సమానత్వం సాధ్యమవుతుందని లింగంపల్లి శ్రీనివాస్ అన్నారు.

## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

- రైతులకు పూర్తి భరోసా
- రైతును రాజుగా చేసే దిశగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే : ఆది శ్రీనివాస్



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ అర్బన్ మండలం,అనుపురం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతులకు ప్రాధాన్యం ఇస్తూ నాణ్యమైన విద్యుత్, ఎరువులు,మెరుగైన విత్తనాలు అందిస్తున్నామని తెలిపారు. రుణమాఫీ అమలు చేసి, సన్న వడ్లు పండించే రైతులకు బోనస్ కూడా ఇస్తున్నామని వెల్లడించారు.రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, పండించిన ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. అవసరమైతే జిల్లా గోదాములను వినియోగించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. మిల్లర్లు కూడా ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉచిత విద్యుత్ ద్వారా రైతు సంక్షేమానికి పునాది వేశారని గుర్తు చేశారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# మహిళా బిల్లు

## - బీసీ మహిళలకు సబ్‌కోటా ఇవ్వాలి

**- బీసీ సాధికారత ఉత్తర తెలంగాణ ఇంచార్జి : పొలాస నరేందర్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) డీలిమిటేషన్‌కు సంబంధం లేకుండా ప్రభుత్వం-విపక్షం సమన్వయంతో మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ఆమోదించి, 33 శాతం రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించాలని బీసీ సాధికారిత సంఘం ఉత్తర తెలంగాణ ఇంచార్జ్ పొలాస నరేందర్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ మహిళల్లో పెద్ద శాతం బీసీలు ఉన్నందున వారికి ప్రత్యేక ప్రాతినిధ్యం అవసరమన్నారు. ఓబీసీ హక్కుల పరిరక్షణకు కులగణన అత్యవసరమని, ఇది సామాజిక అసమానతలను వెలుగులోకి తెచ్చే సాధనమని పేర్కొన్నారు. చట్టసభల్లో కొన్ని వర్గాల ఆధిపత్యం కొనసాగుతోందని, అన్ని వర్గాలకు జనాభా ప్రాతిపదికన సమాన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

# రుద్రమూర్తికి విశేష పూజలు



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) లోకకల్యాణం కోసం ఆలయ ఈశాన్య భాగంలో గల రుద్రవనములోని (రుద్రపార్కులోని) రుద్రమూర్తికి శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపించబడ్డాయి. రుద్రమూర్తి విగ్రహాన్ని గతంలో వైశాఖ మాసములో నెలకొల్పడం జరిగింది. కాగా ఈ రోజు ఉదయం జరిగిన పూజాదికాలలో ముందుగా లోక సంక్షేమాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. ఈ సంకల్పంలో దేశం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో తగినంత వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రకృతి వైపరీత్యాలు నివారించబడాలని, దేశంలో సుఖశాంతులు విలసిల్లాలని, అకాల మరణాలు సంభవించకుండా ఉండాలని, జనులందరికీ సుఖసంతోషాలు కలగాలని పేర్కొనబడింది. తరువాత రుద్రమూర్తికి అభిషేకం నిర్వహించబడింది. అర్చకులు రుద్రమంత్రాలను పఠిస్తుండగా శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, గందోధకం, భస్మోదకం, పుష్పోదకం, బిల్వోదకం, సుగంధోదకాలతోనూ, ఆ తరువాత జలంతోనూ ఈ అభిషేకం నిర్వర్తించబడింది. ఈ కార్యక్రమములో సహాయ కార్యనిర్వహణాధికారి యం. హరిదాసు, అర్చకులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మార్గదర్శకంలో

# పేదలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

**- వేములవాడ మున్సిపల్ చైర్మన్ : పుల్కం రాజు**



రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో తెలంగాణ మైనారిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తుర్క కాశ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పారదర్శకంగా నిర్వహించారు. టూల్ కిట్లు, జనరేటర్ల కోసం వచ్చిన దరఖాస్తులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మార్గదర్శకంలో బడుగు వర్గాల సంక్షేమం కొనసాగుతోందన్నారు. మొత్తం 64 దరఖాస్తుల్లో 37 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని తెలిపారు. అర్హులైన ప్రతి పేదవారికి న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సంపత్ రెడ్డి, టౌన్ మిషన్ కోఆర్డినేటర్ భూలక్ష్మి, అధికారులు, కమ్యూనిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నందీశ్వరస్వామికి విశేషపూజ



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) లోక కల్యాణం కోసం దేవస్థానం ఆలయప్రాంగణంలోని నందీశ్వర స్వామికి (శనగల బసవన్న స్వామివారికి) విశేషార్చనలను నిర్వహించనున్నది. ప్రతి మంగళవారం త్రయోదశి రోజున దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ప్రదోషకాలంలో అనగా సాయంసంధ్యాసమయంలో ఈ విశేషపూజలు నిర్వహించడం జరుగుతోంది. ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతుంది.

# సంక్లిష్ట శస్త్రచికిత్సలు విజయవంతం

- పూర్తిగా కోలుకున్న క్షతగాత్రులు - తెనాలి జిల్లా వైద్యశాల డాక్టర్ల ఘనత
- మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందనలు
- ఒకరికి పీఎం-రాహత్, మరోకరికి ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు కింద ఉచిత వైద్య సేవలు
- సెకండరీ ఆసుపత్రుల ద్వారా రోగులకు అందుతున్న ఉత్తమ వైద్య సేవల పరంపర






అమరావతి (ప్రశ్న న్యూస్)రాష్ట్రంలోని సెకండరీ ఆసుపత్రుల్లోనూ సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను వైద్యులు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. సాధ్యమైనంత వరకు బోధనాసుపత్రులకు రిఫర్ చేయకుండానే ఆపరేషన్ థియేటర్లో ఉన్న అత్యాధునిక మెషిన్లు, ఇతర సౌకర్యాలతో జిల్లా, ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రుల్లోని వైద్యులు రోగులకు ఉత్తమ సేవలు అందిస్తున్నారు. ఈ క్రమంలోనే తెనాలి జిల్లా ఆసుపత్రిలో వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో తీవ్రంగా గాయపడిన సామ్రాజ్యం (65), నాంచారమ్మ (38) అనే మహిళలకు గత శనివారం (ఏప్రిల్ 18) ఎనస్థిటిస్టుల సహకారంతో ఆర్థో వైద్య బృందం చేసిన క్లిష్టమైన శస్త్రచికిత్సల ద్వారా వారు పూర్తిగా కోలుకున్నారని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరబాబు నేడొక ప్రకటనలో తెలిపారు. సామ్రాజ్యం రోడ్డు ప్రమాద కేసును పీఎం- రాహత్ కింద, నాంచారమ్మ కేసును ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు కింద నమోదుచేసి, ఉచితంగా చికిత్స అందిస్తున్నామని వెల్లడించారు. రోడ్డు ప్రమాద బాధితులకు ఉత్తమ చికిత్స అందించిన వైద్యులు, ఇతర సిబ్బందికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులోనూ కొనసాగించాలన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలోని ఆసుపత్రులలో జనవరి నుంచి ఇటీవల వరకు రోగులకు ఉత్తమ సేవలందించిన వైద్య బృందాలను అభినందిస్తూ డీఎస్హెచ్ నుంచి సుమారు 30 వరకు ప్రశంస పత్రాలను చక్రధరబాబు పంపారు.

### వృద్ధురాలి తొడ భాగం నుజ్జునుజ్జు

కొల్లిపర ప్రాంతానికి చెందిన సామ్రాజ్యం (65) భర్తతో కలిసి ద్విచక్రవాహనంపై వస్తున్నప్పుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. కొల్లిపర సీహెచ్ సీలో ప్రాథమిక చికిత్స పొందిన అనంతరం సామ్రాజ్యాన్ని 108 అంబులెన్సు ద్వారా తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. ఎడమ తొడ ఎముక తునాతునకలైంది. ఈ నెల 17వ తేదీ ఆసుపత్రిలో అర్ధరాత్రి చేరగా మరసటిరోజే అత్యవసరంగా 'సూప్రకాండైలార్ లాకింగ్ ప్లేటు సిస్టమ్' (Supracondylar locking plate system) విధానంలో తునాతునాకలైన ఎముక భాగాలను ఒకచోటకు పేర్చి స్క్రూలతో బిగించారు. ఈమె ఇప్పుడు పూర్తిగా కోలుకున్నారు.

### ఆసుపత్రి నుంచి వెళ్లిపోతానని.. చెప్పా.. సామ్రాజ్యం

"శస్త్ర చికిత్స విజయవంతంగా జరిగింది. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నేను తెనాలి జిల్లా ఆసుపత్రికి వచ్చినప్పుడు ఇక్కడ వైద్యం సరిగ్గా అందుతుందో లేదో అన్న భయంతోపాటు నొప్పుల కారణంగా మరో ఆసుపత్రికి పోతానని చెప్పా. ఆసుపత్రి వైద్యులు నాకు ధైర్యం చెప్పి శస్త్రచికిత్స చేశారు. ఆసుపత్రిలో వైద్య సదుపాయాలు బాగున్నాయి. వైద్యులు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు" అని సామ్రాజ్యం తెలిపారు. ఈ కేసును తెనాలి మూడో పట్టణ పోలీసు స్టేషన్లో పీఎం-రాహత్ కింద కేసు నమోదైంది.రూ. 1.5 లక్షల ఉచిత వైద్యం అందుతోంది.అలాగే నాంచారమ్మకు ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచిత వైద్యం అందిస్తున్నారు. నాంచారమ్మ కూడా సంతృప్తి వ్యక్తం చేసారు, వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

### ఆపరేషన్ థియేటర్లలో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు సమకూర్చినందువల్లే..

"ప్రభుత్వ చొరవ కారణంగా ఆపరేషన్ థియేటర్లలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ఆపరేషన్ థియేటర్లలో రెండు సియామ్ మిషన్లు ఉండడం, ఇతర అత్యాధునిక సౌకర్యాలు ఉన్నందువల్ల సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలు చేయగలుగుతున్నాం. మల్టీపేరా మానిటర్స్, వర్క్ స్టేషన్, అత్యవసర చికిత్సకు నా సంబంధించిన పరికరాలు, ఆక్సిజన్, ఇతర సౌకర్యాలు ఉన్నాయి. మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ కు కృతజ్ఞతలు అని" జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ టి.సౌభాగ్యవాణి, ఆపరేషన్ చేసిన సీనియర్ వైద్యులు హనుమంతరావు, మజీదా బేగం వివరించారు.

### తెనాలి జిల్లా వైద్యశాలలోనే అధికం

రాష్ట్రంలోనే డిఎస్హెచ్ ఆసుపత్రుల్లో తెనాలి జిల్లా వైద్యశాలలో ఆర్థో విభాగంలో అత్యధిక శస్త్రచికిత్సలు రాష్ట్రంలోని జిల్లా ఆసుపత్రుల్లో తెనాలిలోనే అత్యధికంగా ఆర్థో విభాగంలో శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ 20వ తేదీ వర కు కలిపి 626 శస్త్రచికిత్సలు జరిగాయి. ఇందులో మేజర్ ఆపరేషన్లు 349.సివిల్ సర్జన్ , ఆర్థో వైద్యుడు డాక్టర్ జె. హనుమంతురావు నేతృత్వంలో వైద్యులు వెంకటేశ్వరరావు, సాయిరామ్, జితేంద్ర, లిఖిత్, ఎనస్థీషియా సీనియర్ వైద్యులు మజీదా బేగం నేతృత్వంలో డాక్టర్ ప్రదీప, డాక్టర్ షాలినీ, డాక్టర్ బిందుతోపాటు సీనియర్ స్టాఫ్ విజయకుమారి, గోపి, నాగలక్ష్మి పాల్గొని ఈ రెండు శస్త్రచికిత్సలను విజయవంతంగా ముగించారు.

### డిఎస్హెచ్ ఆసుపత్రుల్లో ఉత్తమ సేవల వివరాలు మచ్చుకు

అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రిలో గిరిజన మహిళ కడుపులోని 9.5 కిలోల కణితిని తొలగించారు. అలాగే అమలాపురం ఏరియా ఆసుపత్రిలోను 50 ఏళ్ళ మహిళ కడుపులో ఉన్న కణితిని తొలగించారు, రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో మోకాళ్ళ కీళ్ళ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో 4.8 కిలోల శిశువు సహజ ప్రసవం జరిగేలా చేయటంలో సఫలం చెందారు. అలాగే రాజంపేట ఏరియా ఆసుపత్రిలో హైరిస్క్ గర్భిణీకి సాహసోపేతంగా వైద్యులు కాపాడారు.

# మోతిలాల్ ప్రాంత నిర్వాసితుల బాధ్యత నాది:ఎమ్మెల్యే నసీర్

**ఎవరూ అధైర్య పడొద్దు, తప్పని పరిస్థితుల్లోనే ఇళ్లు కూల్చివేత**

**బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం చేస్తాం,చోడవరంలో 106 ప్లాట్లు కేటాయించాం**

**నిర్వాసితులకు 24 గంటలూ అండగా ఉంటా**

**కొందరు సోషల్ మీడియా పిచ్చితో పేదలకు అన్యాయం**



గుంటూరు (ప్రశ్న న్యూస్) మోతీలాల్ నగర్ లో ఇళ్లు కోల్పోయిన వారంతా నా కుటుంబ సభ్యులే ఎవరూ అధైర్య పడొద్దు. నిర్వాసితుల బాధ్యత నాది. వారికి స్వయంగా ఆర్థిక సాయ చేస్తా. తప్పని పరిస్థితుల్లోనే ఇళ్లు కూల్చివేశారు. అభివృద్ధి కోసమే ఇదంతా . కొందరు సోషల్ మీడియా ఆర్టిస్టుల రీల్స్ పిచ్చితో పేదలకు అన్యాయం చేస్తున్నారు. అటువంటి వారిని సమాజం సహించదు. అభివృద్ధి, ప్రజావసరాలపై అవగాహన లేని రాజకీయ భవిష్యత్తు శూన్యం. మోతీలాల్ ప్రాంత వాసులకు చోడవరంలో ఒకే చోట 106 ప్లాట్లు కేటాయిస్తున్నాం" అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మోతీలాల్ నగర్ లో మునిసిపల్, రైల్వే, రెవెన్యూ అధికారులు ఇళ్లు కూల్చివేత నేపథ్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 24 గంటలపాటు మోతీలాల్ నగర్ వాసులకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

**ప్రతి ఒక్కరితో మాట్లాడాకే.** గత ఆరు నెలల నుంచి నెహ్రూ నగర్ లో రైల్వే అభివృద్ధి పనులు చేపట్టారని, అందులో భాగంగా మోతీలాల్ నగర్ ప్రాంతంలో ఆక్రమణలు తొలగిస్తున్నారని తెలిపారు. ఆరు నెలల క్రితమే రైల్వే అధికారులు డ్రెయిన్ల నిర్మాణానికి టెండర్ పూర్తి చేశారని, ఈ క్రమంలో వారితో మాట్లాడి కొంత సమయం కావాలని అడిగి నిలిపివేశామని చెప్పారు. అప్పటి నుంచి ఆ ప్రాంతవాసులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నాలుగు నెలలుగా నిర్వాసితులతో విడివిడిగా మాట్లాడానని చెప్పారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కూటమి నాయకులతో కలిసి ఆ ప్రాంత పెద్దలతో మాట్లాడామని తెలిపారు. అనంతరం మా కార్యాలయానికి పిలించానని, తాను స్వయంగా వెళ్లి అవగాహన కల్పించానని చెప్పారు. నిర్వాసితులు అవకాశం ఉంటే ఎక్కడో ఒక చోటకు వెళ్లాలని సూచించగా.. 70 శాతం మంది ఖాళీ చేశారని తెలిపారు. బుద్ధిలేని వారి మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే నసీర్ స్పష్టం చేశారు.

## తిరుమల కైంకర్య వ్యవస్థకు

# రామానుజాచార్యుల సేవలు విశిష్టం

**ఉభయ వేదాంత విద్వాంసులు నరసింహన్**



తిరుమల(ప్రశ్న న్యూస్) శ్రీ రామానుజాచార్యులు ఏర్పాటు చేసిన కైంకర్య విధానాలు నేటికీ కొనసాగుతున్నాయని శ్రీ నరసింహన్ తెలిపారు. అన్నమాచార్య కళామందిరంలో జరుగుతున్న అవతార మహోత్సవాల రెండవ రోజు ఆయన "రామానుజాచార్యులు -- తిరుమల కైంకర్యము"పై ప్రసంగించారు. తిరుమల, శ్రీ గోవిందరాజస్వామి ఆలయం ఇతర దివ్యదేశాల్లో ఆయన ఏర్పాటు చేసిన వ్యవస్థ ఇప్పటికీ అమలులో ఉందన్నారు. బ్రహ్మోత్సవాలు, అభిషేకాలు, జీయర్ వ్యవస్థ వంటి సేవలను ప్రారంభించారని వివరించారు. అనంతరం తిరుపతికి చెందిన చంద్రశేఖర్ భగవతార్ హరికథ గాన కార్యక్రమంలో ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ పురుషోత్తం, ఇతర అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పౌర హక్కులను కాపాడడం సమాజం భాధ్యత

**- జాతీయ పౌర హక్కుల దినోత్సవం**

**- హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత**

**- ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కమిటీ జిల్లా సభ్యులు, బోయినిపల్లి సెస్ డైరెక్టర్ : కొట్టెపల్లి సుధాకర్**



బోయినిపల్లి(ప్రశ్న న్యూస్) జాతీయ పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు, బోయినిపల్లి సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్ మాట్లాడుతూ పౌర హక్కుల పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. సమాజంలో బలహీన వర్గాలపై జరిగే అన్యాయాలు, అణచివేతలను పూర్తిగా నిర్మూలించేందుకు కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరిగే అట్రాసిటీ కేసుల్లో బాధితులకు తక్షణ న్యాయం అందేలా అధికారులు చురుకుగా వ్యవహరించాలని కోరారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని, వాటిని కాపాడుకోవడం కోసం ప్రజల్లో అవగాహన పెరగాలని సూచించారు. గ్రామ స్థాయిలోనే చట్టాలపై అవగాహన కల్పించి, బాధితులు ధైర్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పౌర హక్కుల దినోత్సవం కేవలం ఒక రోజు పరిమితి కాకుండా, ప్రతి రోజూ మన హక్కులను గౌరవిస్తూ, ఇతరుల హక్కులను కాపాడే దిశగా పనిచేయాలని కొట్టెపల్లి సుధాకర్ పేర్కొన్నారు.

# తెలంగాణ పర్యాటక రంగానికి జాతీయ గుర్తింపు: మంత్రి జూపల్లి



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన 'దివ్య భారత్' పర్యాటక నివేదికలో తెలంగాణ రాష్ట్రానికి విశిష్ట గుర్తింపు లభించడంపై పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని వైవిధ్యభరితమైన పర్యాటక సామర్థ్యానికి ఈ నివేదిక అద్దం పడుతోందని, ఇది తెలంగాణకు గర్వకారణమని ఆయన కొనియాడారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ పర్యాటక రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి ఈ గుర్తింపు నిదర్శనమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాజధానిలోని హుస్సేన్ సాగర్, చారిత్రక గోల్కొండ కోట, భువనగిరి కోట వంటి కట్టడాలతో పాటు ఆధ్యాత్మికత ఉట్టిపడే యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం వంటి ప్రసిద్ధ క్షేత్రాలు నిత్యం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయని వివరించారు.రాష్ట్రంలోని సుసంపన్నమైన సంప్రదాయాలు, రుచికరమైన వంటకాలు, ప్రకృతి రమణీయమైన దృశ్యాలను తిలకించేందుకు దేశ విదేశీ పర్యాటకులు తరలిరావాలని మంత్రి పిలుపునిచ్చారు. పర్యాటక రంగంలో మౌలిక సదుపాయాల కల్పనను మరింత బలోపేతం చేయడంతో పాటు, తెలంగాణ పర్యాటక వైభవాన్ని అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేసేందుకు ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని జూపల్లి కృష్ణారావు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు

# మెట్‌పల్లి అంగన్వాడిలో పోషన్ పక్వాడా అవగాహన కార్యక్రమం



మెట్ పల్లి (ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లా, మెట్‌పల్లి పట్టణంలోని 11వ వార్డు వెంకట్రావుపేట అంగన్వాడి కేంద్రంలో మంగళవారం పోషన్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారం ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రత (పర్సనల్ హైజిన్), గుడ్ టచ్--బ్యాడ్ టచ్ వంటి అంశాలపై వివరించారు.అదేవిధంగా చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించి వారిలో ఉత్సాహాన్ని పెంపొందించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ రెబ్బాస్ మహేష్ మాట్లాడుతూ, ప్రీస్కూల్ హాజరు శాతం పెంచాలని, అంగన్వాడి కేంద్రంలో అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు సరిత, సూపర్వైజర్ షమిం సుల్తానా, అంగన్వాడి టీచర్ కోల పావని, ఆయా నీలిమ పాల్గొన్నారు.

## శ్రీ అగస్తీశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు

# ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభం



నారాయణ వనం(ప్రశ్న న్యూస్) శ్రీ మరగదవల్లీ సమేత శ్రీఅగస్తీశ్వరస్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఉదయం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా ఉదయం 7.30 నుండి 9 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించారు. రాత్రి 7.30 గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజు కోలాటం, ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు జరుగనున్నాయి.ఈ కార్యక్రమంలో ఆలయ టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగరాజు, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**ఆలయ చరిత్ర..**

నారాయణవనం ప్రాంతాన్ని పరిపాలించిన శ్రీ పద్మావతీదేవి తండ్రి అయిన శ్రీ ఆకాశ మహారాజు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఇక్కడ శ్రీ అగస్తీశ్వరస్వామివారు స్వయంభువుగా వెలిశారు. అనంతరం శ్రీ అగస్త్య మహర్షులు వేద ఆగమ శాస్త్ర ప్రకారం ప్రతిష్ఠించి పూజలు నిర్వహించడంతో స్వామివారికి "అగస్తీశ్వరస్వామి" అనే పేరు వచ్చింది.

# శ్రీశైలంలోశంకర జయంతి ఉత్సవాలు



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) వైశాఖ శుద్ధ పంచమి సందర్భంగా ఆదిశంకరుల వారి జయంతి ఉత్సవం నిర్వహించబడింది. ఈ జయంతి ఉత్సవంలో భాగంగా ఫాలధార - పంచధారల వద్ద గల శంకరమందిరంలో ప్రత్యేక పూజలు జరిపించబడ్డాయి.ఈ పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని ముందుగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ ఆలయ అర్చకులు, వేదపండితులు మహాగణపతిపూజను నిర్వహించారు.వేదమంత్రాలతో చంద్రమౌళీశ్వరస్వామివారికి, శ్రీ శారదాదేవికి, శంకరులవారికి విశేషంగా అభిషేకం జరిపించబడింది. పంచామృతాలతోనూ, వివిధ ఫలరసాలతోను, పుణ్యజలంతోను ఈ అభిషేకం ఎంతో శాస్త్రోక్తంగా నిర్వహించబడింది. తరువాత పుష్పార్చన, మహానివేదనలను జరిపించడం జరిగింది..కాగా ఆదిశంకరులవారికి, శ్రీశైలక్షేత్రానికి చాలా దగ్గరి సంబంధం ఉంది. శంకరులవారు శ్రీశైలంలోని ఫాలధార -పంచధార వద్ద కొంతకాలం తపస్సు చేసి ఇక్కడే తమ శివానందలహరి గ్రంథాన్ని రచించారు. ఈ శివానందలహరిలో శ్రీశైలక్షేత్రాన్ని, శ్రీభ్రమరాంబా మల్లికార్జునులను స్తుతించారు. అదేవిధంగా శంకరులవారు యోగతారావళి అనే గ్రంథంలో శ్రీశైలంలోనే సమాధిని పొందాలని అభిలషించారని చెప్పబడుతోంది.ఈ పూజా కార్యక్రమాలలో పర్యవేక్షకులు గంజి రవి, అర్చకస్వాములు, వేదపండితులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు

## హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో

# ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణం

**- 136 వారాలుగా సామూహిక హనుమాన్ చాలీసా - భక్తుల్లో ఆధ్యాత్మికంగా చైతన్యం - వేములవాడ హిందూ ఉత్సవ సమితి**

వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలో భక్తి పరవశంతో ప్రతీ మంగళవారం నిర్వహిస్తున్న హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమం ఈ వారం 136వ వారానికి చేరుకొని ఘనంగా కొనసాగింది.వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీ భీమేశ్వర ఆలయంలో కొలువైన ఆంజనేయ స్వామి సన్నిధిలో ఈ కార్యక్రమాన్ని వేములవాడ హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సామూహికంగా హనుమాన్ చాలీసాను భక్తిశ్రద్ధలతో పారాయణం చేశారు. మంగళవారం కావడంతో ఆలయం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది.పారాయణం అనంతరం హిందూ ఉత్సవ సమితి సభ్యులు కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. గత 136 వారాలుగా నిరంతరంగా కొనసాగుతున్న ఈ కార్యక్రమం భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తోందని నిర్వాహకులు తెలిపారు.





# భూ వివాదాల పరిష్కారంలో సువర్ణాధ్యాయం

**- కుసుమంచిలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్**

**- సర్వే(ఎల్.పి.ఎం), భూధార్ నెంబర్ల కేటాయింపు**

**- భూమి హక్కులకు శాశ్వత భరోసా- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్ )రైతు జీవితం భూమితో ముడిపడి ఉందని ఆ భూమిపై హక్కు స్పష్టంగా ఉన్నప్పుడే అతని జీవితం భద్రంగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆ హక్కును సర్వే మ్యాప్‌తో, భూధార్ నెంబర్‌తో శాశ్వతంగా నిర్ధారించినపుడే రైతుకు ధైర్యం, కుటుంబానికి భరోసా, భవిష్యత్తుపై నమ్మకం కలుగుతుందని అన్నారు.ఈ దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను సమూలంగా బలోపేతం చేస్తూ, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చి రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను ఈనెల 2వ తేదీ నుంచి నారాయణపేట జిల్లా కొస్గి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లిలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని తెలిపారు.రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి అనే నిబంధనను భూభారతి చట్టంలో పొందుపరిచామని అదే విధంగా ఎవరైనా స్వచ్ఛందంగా వారి ఆస్తులకు సంబంధించిన సర్వే సర్టిఫికేట్ కు కూడా దరఖాస్తు చేసుకొని ధృవీకరించుకోవచ్చన్నారు. ఇందులో భాగంగా భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా రిజిస్ట్రేషన్‌కు సర్వే మ్యాప్ ఉండాలన్న నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నామన్నారు. భూభారతి చట్టం ద్వారా ప్రభుత్వం భూ వ్యవహారాల్లో పూర్తిస్థాయి పారదర్శకతను తీసుకొచ్చిందని తెలిపారు. ప్రతి భూమికి ఖచ్చితమైన సర్వే మ్యాప్, ప్రత్యేక భూధార్ నెంబర్ కేటాయించడం ద్వారా యాజమాన్యంపై ఎలాంటి సందేహాలకు తావు లేకుండా చేస్తోందని భూభారతి పోర్టల్ ద్వారా ఈ సేవలను ప్రజలకు సులభంగా అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. సర్వే విషయంలో పాత విధానాలకు స్వస్తి చెప్పి అధునాతన రోవర్లను వినియోగిస్తూ కచ్చితత్వంతో సర్వే పూర్తిచేయిస్తున్నామని తెలిపారు.

# శ్రీవారి సేవ చేయడం అదృష్టం

**- టిటిడి ఈవో ఎం. రవిచంద్ర - ఘనంగా జాతీయ పౌర దినోత్సవం నిర్వహణ**




తిరుమల(ప్రశ్న న్యూస్) శ్రీవారి సేవ చేసే అవకాశం రావడం ఎంతో అదృష్టమని టిటిడి ఈవో ఎం. రవిచంద్ర అన్నారు. తిరుపతి పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో మంగళవారం జాతీయ పౌర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు వి. వీరబ్రహ్మం, డా. ఎ. శరత్, సివిఎస్వో కె.వి. మురళీకృష్ణ ఇతర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ భక్తులకు ఆధ్యాత్మిక భావంతో పాటు సమిష్టి భావనతో ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. జాతీయ పౌర దినోత్సవం కేవలం సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకే కాకుండా ప్రతి ఒక్కరికీ సంబంధించినదని తెలిపారు. అందరూ స్వయం అనుభూతితో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రజల మధ్య ఉద్యోగులు వారధిలా ఉంటారని చెప్పారు.చట్ట పరిపాలన సూత్రాలను పాటిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ స్థాయిలో బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని చెప్పారు. పరస్పర సహకారంతో, సమూహంగా పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు.అలాగే, అందరికీ అర్థమయ్యే భాషలో మాట్లాడితే విషయాన్ని సులభంగా అర్థం చేసుకోవచ్చని, వీలైనంత వరకు తెలుగులోనే భావ వ్యక్తీకరణ చేయాలని సూచించారు. టిటిడిలో మొదటిసారి జాతీయ పౌర దినోత్సవాన్ని ఉద్యోగుల మధ్య నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.ఈ సందర్భంగా అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి మాట్లాడుతూ, క్షేత్ర స్థాయి అనుభవాలను వినియోగించుకుంటూ వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించారు. టిటిడిలో అభిప్రాయాల సేకరణ విధానం ద్వారా భక్తులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు.నిరంతరం శిక్షణ అవసరమని, మంచి ఫలితాల కోసం జ్ఞానం తో పాటు అనుభవం కూడా అవసరమని అన్నారు. ఉద్యోగులు ఎప్పటికప్పుడు తమను తాము మెరుగుపరుచుకుంటూ నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టిటిడి సీఈ టి.వి. సత్యనారాయణ, డిప్యూటీ ఈవోలు, ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధిపతులు ఉద్యోగులు పాల్గొన్నారు.

## వేసవికాలం దృష్ట్యా ముందస్తుగా

# తాగునీటి పనులకు శ్రీకారం

**- ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే లక్ష్యం - జాగిర్యాల్ గ్రామ సర్పంచ్ : గడల ప్రసాద్**

భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా, భీంగల్ మండలం, జాగిర్యాల్ గ్రామంలో వేసవికాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యగా మినీ వాటర్ ట్యాంకులకు నీటి సరఫరా పైప్‌లైన్ పనులను గ్రామ సర్పంచ్ గడల ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గడల ప్రసాద్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు కలగకుండా శాశ్వత పరిష్కార దిశగా ఈ పనులను చేపట్టామని తెలిపారు. వేసవిలో నీటి కొరత ఎక్కువగా ఉండే నేపథ్యంలో ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, వీడీసీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## బోయినిపల్లి మండల కేంద్రంలో చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ నల్ల మోహన్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ నల్ల మోహన్ మంగళవారం వార్డు సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఎండాకాలం తీవ్రతను దృష్టిలో ఉంచుకొని బస్టాండ్ కూడలి వద్ద ఈ సదుపాయాన్ని కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, మండల కేంద్రానికి వచ్చే ప్రజలు, ప్రయాణీకుల దాహాన్ని తీర్చేందుకు చలివేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామంలో త్రాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైతే రైతుల బావుల నుంచి నీటిని తీసుకొని గ్రామంలో సరఫరా చేసే ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం గ్రామంలోని బావులను పరిశీలించి రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్, వార్డు సభ్యులు బొజ్జ నరేందర్, దూస శ్రీనివాస్, నాయకులు మెరుపుల జలంధర్, మెరుపుల గంగాధర్, వాసాల శ్రీనివాస్, బొడ్డు తిరుపతి, భీమనాథుని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్ దిశా నిర్దేశంతో కరీంనగర్ అభివృద్ధి ప్రగతి పథంలో..!

- నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ నేతృత్వంలో అభివృద్ధి జోరు
- కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలతో నగర రూపురేఖలు మారుతున్నాయి
- 48 వ డివిజన్ కార్పొరేటర్ : కర్రె పద్మ - అనిల్ కుమార్



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) కరీంనగర్ నగర అభివృద్ధికి భారతీయ జనతా పార్టీనే ప్రత్యామ్నాయం అని 48వ డివిజన్ కార్పొరేటర్ కర్రె పద్మ – అనిల్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్ నాయకత్వంలో నగరం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని తెలిపారు. అలాగే దేశ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు నగరాల అభివృద్ధికి బలమైన పునాదులు వేస్తున్నాయని అన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజల సహకారంతో కరీంనగర్‌ను మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నామని కార్పొరేటర్ కర్రె పద్మ – అనిల్ కుమార్ స్పష్టం చేశారు.

## ఉద్యోగస్తులందరూ బాధ్యతగా తమ విధులు నిర్వహించాలి

- ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో మీదే కీలక పాత్ర
- సచివాలయంలో మహనీయుల జయంతి వేడుకల్లో
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా మంగళవారం సచివాలయంలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్ని రోజులు శక్తి ఉంటే అన్ని రోజులు అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఉద్యోగుల సంక్షేమ కోసం నిరంతరం పాటుపడతానని స్పష్టం చేశారు. అంబేద్కర్ సూచించిన విధంగా కేవలం చదువు ద్వారానే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకెళ్తున్నారని చెప్పారు. అందులో భాగంగానే లోయర్ ట్యాంక్ బండ్ సమీపంలో అంబేద్కర్ నాలెడ్జి సెంటర్ అలాగేనింబోలి అడ్డ లో ఒక లైబ్రరీ , హాస్టల్ ను ఏర్పాటుకు బడ్జెట్ లో ముఖ్యమంత్రి నిధులు కేటాయించారని గుర్తు చేశారు. మహనీయులు చూపిన మార్గంలో ఉద్యోగస్తులందరూ నడవాలని తద్వారా ఆయా వర్గాలకు మేలు కలిగే విధంగా ప్రభుత్వం నిర్దేశించిన పథకాలను క్షేత్రస్థాయిలో అందేలా ఉద్యోగస్తులదే ఈ యొక్క పాత్ర కాబట్టి అందుకు అనుగుణంగా పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. మనందరం ఒక గొప్ప సందర్భంలో కలుసుకోవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ప్రశాంత్ సలహాదారులు సైదా , ఉద్యోగుల సంఘల సహకార సంఘం అధ్యక్షుడు రెడ్ల రాజేశ్వర్, సునీత అడిషనల్ సెక్రటరీ, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి ప్రధాన కార్యదర్శి ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ టీం కి సెల్ ఫోన్లు, బాక్స్ క్రికెట్ కోర్టు ప్రారంభం:ఎమ్మెల్యే శ్రీగణేష్

- అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్ వైజర్ లకు సెల్ ఫోన్ లను అందజేత
- తిరుమలగిరి చెరువు సుందరీకరణ పనులను అధికారులు,కాంట్రాక్టర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన
- బాక్స్ క్రికెట్ కోర్టును ప్రారంభించిన ఎమ్మెల్యే





కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) స్త్రీ శిశు సంక్షేమ శాఖ నుంచి కేటాయించిన మొబైల్ స్మార్ట్ ఫోన్ లను ఇరవై తొమ్మిది మంది అంగన్వాడీ టీచర్లకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ మంగళవారం పికెట్ లో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంగన్వాడీ టీచర్లతో మాట్లాడుతూ గర్భిణీ బాలింతలు పిల్లల వివరాలు,పౌష్టికాహార పంపిణీ వివరాలు ఆన్లైన్లో నమోదు చేయడానికి ప్రభుత్వం శిశు సంక్షేమ శాఖ నుండి ఈ మొబైల్ ఫోన్ లను అంగన్వాడీ టీచర్లకు అందిస్తున్నారని అంగన్వాడి సేవలో ఎటువంటి లోపాలు లేకుండా అందించాలని కోరారు. పోషణ మాసం సందర్భంగా పోస్టర్లను రిలీజ్ చేసి సరైన పోషణ ఆరోగ్య తెలంగాణని నిర్మించడానికి అంగన్వాడీ వ్యవస్థ మరింతగా కృషి చేయాలన్నారు. అంగన్వాడి సెంటర్ లోని సమస్యలను తెలుసుకొని పరిష్కారం కొరకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని డాక్టర్ జె.స్వప్న,బ్లాక్ కోఆర్డినేటర్ సరిత,అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

### తిరుమలగిరి లో ఎమ్మెల్యే శ్రీ గణేష్ పర్యటన

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూ.10 కోట్ల వ్యయంతో చేపట్టిన తిరుమలగిరి చెరువు అభివృద్ధి,సుందరీకరణ పనులను స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్ నిన్న మంగళవారం అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. చెరువు చుట్టూ జరుగుతున్న సివిల్ పనులు, అక్కడ నిర్మించనున్న వాకింగ్ ట్రాక్ నిర్మాణం, చూట్టు ఆహ్లాదకరమైన వాతావరణం లో ప్రజలు ఉదయాన్నే వాకింగ్ చేసే వీలుగా ఉండాలన్నారు. మరీన్నీ పూల మొక్కలతో సుందరీకరణంగా ఉండేటట్లు చూసుకోవాలని అధికారులకు, గుత్తేదారులకు పలు కీలక సూచనలుచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ ఈ చెరువు కంటోన్మెంట్ పరిధిలో ఉన్నప్పటికీ, నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎక్కడా రాజీ పడకుండా, అత్యున్నత నాణ్యత ప్రమాణాలను పాటించాలని కాంట్రాక్టర్‌ను,నిర్ణీత గడువులోగా పనులన్నీ పూర్తి చేసి,చెరువును వీలైనంత త్వరగా స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఆనకట్ట (చెరువు) చుట్టూ పచ్చదనం పెంచడం, ఆధునిక లైటింగ్ ఏర్పాటు చేయడం సందర్శకులకు అవసరమైన వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

పనులకు సంబంధించి ఎలాంటి అనుమతులు కావాలన్నా తన వంతు సహకారం అందిస్తానని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఎమ్మెల్యే స్థానిక ప్రజలతో కాసేపు ముచ్చటించి,వారి అభిప్రాయాలను, అభ్యంతరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజల సూచనలను పరిగణనలోకి తీసుకుని పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ఇంజనీర్లు,కాంట్రాక్టర్లు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### యువతకు క్రీడలతో ప్రోత్సాహం:ఎమ్మెల్యే..

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ నిన్న మంగళవారం తిరుమలగిరి లోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ కోర్టును ప్రారంభించారు. బాక్స్ క్రికెట్ కోర్టు ప్రారంభోత్సవానికి స్కూల్ యాజమాన్యం ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై కోర్టును ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్కూల్ విద్యార్థులు కోర్టును ఉపయోగించుకుని మెరుగైన క్రీడా కారులుగా తయారవ్వాలని, జాతీయ , అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల కూడా మక్కువ చూపాలని, మెరుగైన క్రీడా కారులుగా రూపాంతరం చెందాలని, మానసికంగా శారీరకంగా దృఢంగా ఉన్నప్పుడే విద్యార్థులు విద్యను కూడా చక్కగా అభ్యసిస్తారని అన్నారు. స్కూల్ యాజమాన్యం విద్యార్థులను క్రీడల పట్ల శ్రద్ధ చూపడానికి అవకాశం కల్పించినందుకు వారిని మనస్ఫూర్తిగా అభినందించారు.

# “రీల్ రియల్ లైఫ్”ని కాటేసింది

- రీల్స్ చేస్తూ ప్రమాదవశాత్తు జారిపడి మైనర్ బాలుడి మృతి
- స్మార్ట్ ఫోన్లు రక్త సంబంధాలనుతెంపేస్తుంది.చిన్న,పెద్ద తేడ లేకుండ రీల్ ముసుగులో మసకబారుతున్న జీవితాలు
- ఫస్ట్ ఇయర్ టూ ప్లేస్ 70 వరకు స్మార్ట్ ఫోన్లు,కళల ప్రపంచంలో ఎంజాయ్, కానరాని లోకాలకు
- రియల్ లైఫ్ లో స్మార్ట్ ఫోన్ భాగమా,జీవితానికే బ్రేకా, మితిమీరిన ఆలోచనతో మతి పోయే పరిషాన్లు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రపంచ దేశాలు స్మార్ట్ తో దూసుకుపోతున్నాయి. ఆర్థికంగా స్థిరపడుతూ, ఆధునిక పరిజ్ఞానంతో రూపొందించిన వస్తువులను మార్కెట్ లో అందుబాటులో ఉంచుతున్నారు. ప్రస్తుతం మనిషి రోబో లా శ్రమిస్తున్నారు. ఊహకందని రీతిలో సరికొత్త ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు చేస్తున్న ఘనుడు ఈ తరం మనిషి. ఈ నేపథ్యంలో ప్రపంచ దేశాలతో పోటీ పడుతూ,తనదైన శైలిలో సామాన్యులకు సైతం అందుబాటులో ఉండేవిధంగా స్మార్ట్ పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. మరీ ముఖ్యంగా భారత దేశం మారు మూల గ్రామాల్లో సైతం ఆధునిక పరిజ్ఞానంతో రూపొందించిన వస్తువులను వాడకంలో ముందంజలో ఉంది అంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఈ రోజుల్లో పసి పిల్లలు కూడా స్మార్ట్ డిజిటల్ తరగతిలో నూతన విద్య విధానాన్ని కి దగ్గరౌతున్నారు. చేసే వృత్తి ముఖ్యం కాదు, అరచేతిలో స్మార్ట్ ఫోన్ ఉందా లేదా అనేదే ప్రశ్న. పుస్తకాల పురుగులు మంచానా పడ్డారు. పేద,ధనిక తేడా లేకుండా అరచేతిలో “ట్యాబ్”లు ఉండడం సర్వసాధారణం అయిపోయాయి. మరో విషయం ఉపాధి అవకాశాలు కూడా డిజిటల్ ద్వారా ఎక్కువైయ్యాయి. గృహ ఉపయోగ వస్తువులను ఆన్ లైన్లో కొనుగోలు,కాసేపటికే డెలివరీ. ఇంత వరకు బాగానే ఉంది.

### స్మార్ట్ తో సిక్కులేన్నో:

సంస్కృతి,సంప్రదాయాలు,బాషా,ప్రాంతాలు సంబంధం లేకుండా ప్రజలు వారికి అందుబాటులో ఉన్న స్మార్ట్ ఫోన్ తో “రీల్స్ తో ఎంటర్టైన్మెంట్”చేస్తూ మాయ ప్రపంచంలో మునిగి తేలుతున్నారు. ఒక్కసారి ఈపిచ్చి పట్టిందా జీవితాంతం నీడలా వెంటాడుతుంది. కళ్లముందు ఎవ్వరున్న పట్టించుకోకుండా వారి ప్రపంచంలో ఎంజాయ్ చేస్తారు. వారి లోకంలో ఉన్నప్పుడు ఎవరైనా ఇబ్బందులు సృష్టిస్తే ఎంత దూరమైనా వెళ్తారు వీళు. బంగారు భవిష్యత్తుని సైతం పక్కకు పెట్టు పనికి రాని రీల్స్ కోసం ఎంతటి సాహసమైన చేస్తారు. ఆ క్రమంలో వారి జీవితాలు నాశనం అవుతున్న పట్టించుకోకుండా పనిలో నిమగ్నమయ్యేతూ ప్రాణం మీదికి తెచ్చుకుంటారు. ఈనేపథ్యంలో నిన్న మంగళవారం ఓ పసి ప్రాణం గాల్లో కలిసిపోయింది. సామజిక మధ్యమాల్లో రీల్స్ చేస్తూ బిల్డింగ్ నుంచి జారిపడి మైనర్ బాలుడు మితున్ (14 సంవత్సరాలు)మృతి చెందిన సంఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లాపూర్ గాంధీ బొమ్మ వద్ద ఉన్న బస్తిలో చోటుచేసుకుంది. దీంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. సీసీటీవీ కెమెరాలో నిక్షిప్తమైన బాలుడు కిందపడుతున్న దృశ్యాలు అందర్నీ కంట తడి పెట్టించింది. ఈ నెల 5వ తేదీన జరిగిన ఈ సంఘటన. హాస్పిటల్ లో చికిత్స పొందుతూ జీవన పోరాటాలమధ్య రెండు రోజుల క్రితంచనిపోయిన బాలుడు. బాలుడి మృతదేహాన్ని సొంత ఊరు అయిన బీహార్ కు తరలిస్తున్న బంధువులు. సొంత ఊర్లో ఉపాధి



లేక నగరానికి వచ్చి కూలీ నాలీ చేసుకుంటున్న తల్లిదండ్రులకు పేదరికం దూరం అయితది అనుకుంటే చేతికి వచ్చిన కోడుకు కాటికి దారి చూపాడని ఆవేదన వ్యక్తంచేశారు. కన్నీటిపర్యంతమవుతున్న సమయంలో ఆ ఇంటి పెద్ద దిక్కు సమాజంలో ఉన్న పెద్ద మనుషులకు నా చిన్న విజ్ఞప్తి అంటూ పిల్లలకు”స్మార్ట్ ఫోన్లు” ఇవ్వదు,ఇస్తే తిరిగి రాని లోకాలకు వారు,ప్రతి రోజూ వారీ గుర్తులతో ప్రతి రోజూ మనల్ని మనం బాధపడడం తప్ప మరేమీ ఉండదన్నారు.

# హైందవ ధర్మంలో అందరు భాగస్వామ్యులే: శ్రీధర్ బాబు

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా శ్రీ ఆదిశంకరాచార్య వైభవాన్ని దేశ ప్రజలకు, యువతకు తెలియచేసే బృహత్తర సంకల్పంతో ఆదిశంకర జయంతి పురస్కరించుకుని రథయాత్ర ప్రారంభించడం సంతోషకరమని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు నిన్న మంగళవారం సాయంత్రం సికింద్రాబాద్ కంటోన్మెంట్ తాండ్ బంద్ ఆంజనేయ స్వామి ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన అన్నారు. సికింద్రాబాద్ తాడుబంద్ హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన శ్రీ ఆది శంకరాచార్య వైభవం రథయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు,ఎమ్మెల్యేలు శ్రీ గణేష్, శంకరయ్య లకు వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఎమ్మెల్యేలు శ్రీ గణేష్ శంకరయ్యలు అవధానులు స్వామీజీలు కలిసి రథయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ వేద భారతి సంస్థ ఆధ్వర్యంలో రేవల్ల అవధాని భావితరాలకు అద్వైత సిద్ధాంతాన్ని తెలియజేయాలని గొప్ప సంకల్పంతో లోక కళ్యాణార్థం ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అద్భుతమని కొనియాడారు. వేద ధర్మాన్ని నిలబట్టేందుకు కృషి చేస్తూ వేద భారతీయ సంస్థ చేస్తున్న గొప్ప కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వ సహకారం ఉంటుందని అన్నారు. దేశ యువత ఆదిశంకరాచార్యుల తత్వాన్ని అద్వైత సిద్ధాంతాన్ని అర్థం చేసుకుంటే ప్రతి ఒక్కరిలో మంచి మార్పు వస్తుందని స్పష్టం చేశారు. హిందువులలో ఐక్యతతో పాటు వివిధ సంప్రదాయాలను



పాటిస్తున్న వారిని ఏకతాటిపైకి తీసుకువచ్చిన మహనీయుడు ఆదిశంకరాచార్యులు అని ఆయన గుర్తు చేశారు. శృంగేరి పీఠాధిపతి శంకరాచార్యులు ఆది శంకరాచార్యుల వైభవం నలుమూలల వ్యాపింపచేసేదిశగా అనేక కార్యక్రమాలను తీసుకున్నట్లు 108 చోట్ల 700 రోజులపాటు సాగే రథయాత్రలో ఆదిశంకరాచార్యులు విగ్రహాలను సైతం ప్రతిష్టించనున్నట్లు వెల్లడించారు. ఆదిశంకరాచార్యుల అద్వైత సిద్ధాంతాన్ని ప్రచారం చేయడం రథయాత్ర ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు.

## బాధ్యతాయుతంగా జనగణన పూర్తి చేయాలి

**తెలంగాణ రాష్ట్ర జన గణన డైరెక్టర్ భారతి హోలీకెరి**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) జనగణన – 2027ను సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లు బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని జనగణ డైరెక్టర్ భారతి హోలీకెరీ అన్నారు.మంగళవారం మెదక్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్,జనగణ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు.జనగణన 2027 లో భాగంగా హౌస్ లిస్టింగ్ బ్లాక్స్, లిసెన్సస్ మానిటరింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ డిజిటల్ విధానం, స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) పై సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు జన గణనకు సంబంధించిన కిట్లను సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొదటి దశలో మే 11 వ తేదీ నుంచి జూన్ 09 వ తేదీ వరకు ఇండ్ల గణన నిర్వహిస్తారని, రెండో దశ ఫిబ్రవరి 2027 లో వ్యక్తుల వారిగా సమాచారం సేకరిస్తారని అధికారులు తెలిపారు. ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా సేకరించి.. నమోదు చేయాలని ఆదేశించారు. అందరి వివరాలు గోప్యంగా ఉంచాలని స్పష్టం చేశారు.ఎండాకాలం నేపథ్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీటి బాటిల్ వెంట తీసుకువెళ్లాలని సూచించారు. ఈ నెల 26 వ తేదీన స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా చేసుకోవాలని ఆదేశించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బాధ్యతల నిర్వహణలో ఎంతో కీలకమని స్పష్టం చేశారు. వివరాలు పక్కాగా సేకరించి నమోదు చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జిల్లా ప్రతిమా సింగ్ , మెదక్ ఆర్ డి ఓ రమాదేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ,ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోపాటు సామాజిక అంశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలి

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**




మెదక్ ప్రతినిధి ((ప్రశ్న న్యూస్ ) విద్యతోపాటు సామాజిక అంశాలపై విద్యార్థిని, విద్యార్థులు అవగాహన కల్పించాలని లికలెక్టర్ ప్రతిమా సింగ్ ఉపాధ్యాయులకు సూచించారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 20 నుండి 26 వరకు సంక్షేమ వారోత్సవాలు ప్రారంభం అయిన నేపథ్యంలో రెండవ రోజు టేక్మాల్ మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ లో ఎంపీడీవో గారు ఎంఈఓ తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వసతి గృహంలోని స్టోర్ గది కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, తరగతి గదులు, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూపరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారిస్తూచర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ పాఠశాలలో విద్యార్థుల యొక్క ప్రతిభను సృజనాత్మకతలను వెలికి తీయడం మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండేందుకు తీసుకోవలసిన చర్యలు వివిధ సబ్జెక్టులలో జ్ఞానాన్ని మరియు శీఘ్ర ఆలోచనా విధానాన్ని పరీక్షించడం కోసం క్విజ్ పోటీలు, బాలల హక్కుల, కార్యక్రమాలు, బాలల హక్కులు, విద్య మరియు ఆరోగ్య అవగాహనపై వీధి నాటకాలు, సామాజిక న్యాయం, విద్య మరియు పర్యావరణం – ఆంగ్లంలో మరియు తెలుగులో చర్చ ప్రసంగాలు సామాజిక న్యాయ, ప్రకృతి మరియు సంస్కృతి అంశాలపై సృజనాత్మక వ్యక్తీకరణ పై డ్రాయింగ్, పెయింటింగ్ తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రియా యాయుద్దీన్, పంచాయితీ సెక్రెటరీ రాకేష్ , తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల ఈత సరదా తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగల్చవద్దు

- పిల్లలను ఒంటరిగా ఈతకు పంపొద్దు
- మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దు
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు,




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలు ఈతకు వెళ్లే విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తత పాటించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే పిల్లల ఈత సరదా ప్రమాదంగా మారే అవకాశముందని హెచ్చరించారు. నీటి లోతు తెలియకపోవడం, జారి పడటం వంటి కారణాలతో చిన్నారులు ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు తరచుగా వెలుగుచూస్తున్నాయని పేర్కొన్నారు.

కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయరాదన్నారు. పిల్లలకు ఈత నేర్పించాలని అనుకుంటే తప్పనిసరిగా తల్లిదండ్రులు లేదా పెద్దల పర్యవేక్షణలోనే నేర్పించాలని సూచించారు. గ్రామాల్లోని బావులు, చెరువుల వద్ద భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలన్నారు. ప్రమాదం జరిగక ముందే జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని, పిల్లల సరదా తల్లిదండ్రులకు జీవితాంతం మిగిలే విషాదంగా మారకూడదని ఎస్పీ పేర్కొన్నారు. అదేవిధంగా మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకున్న ఘటనలను గుర్తు చేస్తూ, అటువంటి చర్యలకు దూరంగా ఉండాలని తల్లిదండ్రులను హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చినట్లు తేలితే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వేసవి కాలంలో పిల్లలు ఎక్కువ సమయం ఖాళీగా ఉండే పరిస్థితుల్లో, వారిని ఇంట్లోనే ఉంచి చదువు, క్రీడలు లేదా ఇతర సృజనాత్మక కార్యకలాపాల వైపు దారి చూపాలని ఎస్పీ సూచించారు. పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు, గ్రామస్తులు అందరూ సమిష్టిగా బాధ్యత వహించాలని కోరారు.

# అంతా ధరణి మాయ..?

- ఎవరూ లేరని చెప్పి ఆ భూమిపై కన్నేసిన పెద్దమనుషులు.
- రికార్డ్ లో ఒక్కరు... ఆన్లైన్ లో మరొకరు.
- సర్వే నెంబర్ 190 లో 7 ఎకరాల భూమి పట్టా అక్రమం.
- రికార్డుల్లో మొఖ మీద ఫీల్డ్ సర్వే లేకుండానే ఎలా చేశారు.
- మరో సర్వే నెంబర్ 140 లో 5 ఎకరాల భూమి పట్టా అక్రమమే.
- లేకుంటే అక్రమంగా మరో వ్యక్తుల మీదకు పట్టా ఎలా చేశారు..?
- స్థానిక గ్రామ ప్రజల్లో ఉత్పన్నమవుతున్న రకరకాల ప్రశ్నలు.







మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మండలం నాగారం శివారులోని రెండు సర్వే నెంబర్ లో ఇద్దరు వ్యక్తులు అక్రమంగా పట్టా చేసుకోవడంతో ఆ గ్రామ ప్రజల నుండి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.అయితే నాగారం శివారు సర్వే నెంబర్ 190 లో 7 ఎకరాల భూమి ఉంది.పాత పహాణిలో దాసరి రాయలింగ్ పేరు మీద భూమి ఉంది.ఇట్టి భూమి పోతారం గ్రామానికి చెందిన ఉప్పుల సత్తమ్మ పేరు మీదకు ఎలా మార్చారు.అదే శివారులోని మరో సర్వే నెం 140 లో 5 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి పాత పహాణి ప్రకారం ఉన్న వ్యక్తి కి కాకుండా ఉప్పట్ల గ్రామానికి చెందిన దాసరి స్వామి కి 5 ఎకరాల భూమి ఎలా మారింది అన్నీ నేనే నన్ను ఎవరేమీ చేయలేరు అని విర్రవీగుతున్న దాసరి స్వామి.రెవెన్యూ అధికారులు డబ్బులు తీసుకోని అక్రమంగా పట్టా చేశారా..? లేక రాజకీయ ఒత్తిళ్లతో పట్టా చేశారా..? అనే సందేహాలు స్థానిక ప్రజల నుండి వ్యక్తం అవుతున్నాయి.అయితే ఈ అక్రమ పట్టా వ్యవహారం ఇప్పుడే పోతారం, ఉప్పట్ల గ్రామ రైతుల్లో చర్చనీయాంశం అయ్యింది. రెవెన్యూ రికార్డ్ లో ఉన్న పేరు మీద పట్టా చేయకుండా అధికారులు ఇలా వేరే వ్యక్తుల పై అక్రమంగా పట్టా చేయడం ఏంటనే అనుమానాలకు తవిస్తున్నాయి.ఇలా అక్రమంగా పట్టాలు అధికారులు ఎన్ని చేసుంటారోననే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి.అంతా ధరణి మాయేనని రికార్డ్ లో ఒక్కరు... ఆన్లైన్ లో మరొకరు పేరు ఎలా ఉంటుందోనని డబ్బులు ముట్టితే చాలు... ఒక్కరి పేరు మీద ఉన్న భూమి మరొకరి పేరు మీదకు పట్టా చెయ్యాల్సిందేనా..? అనే సందేహాలు కూడా రైతుల్లో నుండి వినిపిస్తున్నాయి. ఈ అక్రమ పట్టా వ్యవహారంలో ఎవరికీ ఎంత డబ్బులు ముట్టాయి..? ఎవరి ఒత్తిళ్ళతో పట్టా చేశారు..? దీనికి కారకులేవారు..? అని స్థానికులు చర్చించుకుంటున్నారు.ఇప్పటికైనా ఉన్నత అధికారులు ఈ అక్రమ పట్టా పై విచారణ చేసి... పట్టా రద్దు చేసి అసలైన వ్యక్తులకు పట్టా చేసి ఈ అక్రమ పట్టాకు కారకులైన వారి పై చర్యలు తీసుకోవాలని బూడిది గణేష్, గొర్రింకల సురేష్ డిమాండ్ చేస్తున్నారు. దీనిపై స్థానిక రైతులు, రైతు సంఘాలు, దళిత సంఘాలు రాజకీయ విశ్లేషకులు మేధావులు కోరుతున్నాయి.

# రైతులకు భరోసానిచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే...

**-వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్**



మంథని ( ప్రశ్న న్యూస్)రైతు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రైతులకు భరోసానిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి., మంథని ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని శ్రీరాంనగర్, గంగాపురి, శ్రీపాద కాలనీ, అంగుళూరు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. అలాగే సూరయ్యపల్లి, కాకర్లపల్లి, ఖానాపూర్, ఎక్లాస్ పూర్ కొనుగోలు కేంద్రాలను సర్పంచులు ఆర్ల నాగరాజు, కనవేన కొమురయ్య, సంగెం అరుణ-గట్టయ్య, బొడ్డు రజిత – శ్రీనివాస్ లు ప్రారంభించారు. అనంతరం లక్కెపూర్, తోట గోపయ్యపల్లి, గుమ్మునూర్, గాజులపల్లి, మైదుపల్లి కేంద్రాలను ఆయా గ్రామాల సర్పంచులు ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జిల్లా అధికారులను ఆదేశించడం జరిగిందని అన్నారు. నస్తూరుపల్లి లో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులు విడుదల చేయడం జరిగిందని అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు యెల్లంకి వంశీధర్, మాచిడి రాజు గౌడ్, మద్దికట్ల స్రవంతి – రమేష్ బాబు, పెంటరీ రాజు, జంబోజు శ్రీమతి – సమ్మయ్య, సింగిల్ విండో మాజీ డైరెక్టర్లు ఆకుల రాజ బాపు, లెక్కల కిషన్ రెడ్డి, నాయకులు పేరవేన లింగయ్య, మంథని సత్యనారాయణ, ఆకుల శ్రీనివాస్, గుండా పాపా రావు, సేమంతుల ఓదెలు మెండె రాజయ్య, పెండ్లి ప్రభాకర్ రెడ్డి, ఆర్ల నారాయణ, మంథని శ్రీనివాస్, ఆకుల శ్రీనివాస్, కనవేన ఓదెలు, ప్రత్యూష, గోవిందుల రమేష్, భీముని వెంకట స్వామి, కెక్కర్ల మారుతి,రేపాక శ్రీనివాస్, గుంటుకు గణేష్, మహేష్,నారమల్ల శంకరయ్య, గుంజె సత్యనారాయణ, పర్శవేన మల్లయ్య, లింగమూర్తి, బిరుదు సమ్మయ్య, పెగడ రాజు, జంజర్ల శ్రావణ్, బూడిద రంజిత్, భాద్రపు శ్రీనివాస్, అప్పాల పర్వతాలు, మంథని సదానందం, సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, రైతులు, హమాలీ సంఘం నాయకులు, సంఘ సిబ్బంది,పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బోయినిపల్లి పోలీస్ ఠాణా ఆకస్మిక తనిఖీ

- భద్రతపై ఎస్పీ కీలక ఆదేశాలు
- సైబర్ నేరాలపై గ్రామాల్లో అవగాహన పెంచాలి
- రౌడీ షీటర్లపై నిఘా కట్టుదిట్టం - గంజాయి, జూదంపై కఠిన చర్యలు
- జిల్లా ఎస్పీ : మహేష్ బి గీతే






బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి పోలీస్ స్టేషన్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు, రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులను వేగంగా పూర్తి చేయాలని, దర్యాప్తులో అలసత్వం లేకుండా నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రౌడీ షీటర్లు, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా కట్టుదిట్టం చేసి శాంతి భద్రతలను పరిరక్షించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ ఓటిపిలు,అనుమానాస్పద కాల్స్, లింకులు పంచుకోకూడదని తెలియజేయాలని తెలిపారు.రోడ్డు భద్రతపై హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం,మద్యం సేవించి డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్‌పై అవగాహన పెంచాలని ఆదేశించారు. సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రజలు,వ్యాపారస్తులను భాగస్వామ్యం చేయాలని, గంజాయి,జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వేములవాడ డిఎస్పీ శ్రీనివాసులు,వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్,బోయినిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఐక్యతకు మార్గదర్శకంగా నిలిచిన విలాసాగర్ హిందూ మహా సమ్మేళనం

- హిందూ మహా సమ్మేళనం గ్రామాభివృద్ధి, సామాజిక ఐక్యతకు దోహదపడుతుంది
- చిన్నారుల ప్రత్యేక వేషధారణలతో ఆకట్టుకున్న భారీ ర్యాలీ
- విలాసాగర్ గ్రామ సర్పంచ్ : ఏనుగుల కనుకయ్య





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, విలాసాగర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన "హిందూ మహా సమ్మేళనం" కార్యక్రమం గ్రామంలో ఐక్యతకు ప్రతీకగా నిలిచిందని విలాసాగర్ సర్పంచ్ పేర్కొన్నారు. పార్టీలకతీతంగా, కులాలకతీతంగా గ్రామ ప్రజలు ఒక్కటై ఇలాంటి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ఆనందదాయకమని అన్నారు.శంభుల వెంకటేశం ప్రత్యేక చొరవతో నిర్వహించిన ఈ మహా సమ్మేళనం గ్రామాభివృద్ధి, సామాజిక ఐక్యతకు దోహదపడుతుందని తెలిపారు. సమీప గ్రామాలైన మర్లపేట,దేశాయిపల్లి, జగ్గారావుపల్లి,రత్నంపేట ప్రజలు భారీగా పాల్గొనడం కార్యక్రమానికి మరింత ఉత్సాహాన్ని తెచ్చిందని తెలిపారు.ర్యాలీలో చిన్నారుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయని, ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు యువతలో సంప్రదాయాలపై అవగాహన పెంపొందిస్తాయని సర్పంచ్ కనుకయ్య అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కూడా గ్రామంలో ఇలాంటి ఐక్యత కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు.

# ఉద్యోగ సంఘం నేత కాకర్ల వెంకట్రామిరెడ్డిని డిస్మిస్

**హైదరాబాద్,** ఏపీ ప్రభుత్వం ఉద్యోగ సంఘం నేత కాకర్ల వెంకట్రామిరెడ్డిని డిస్మిస్ చేసిన సంగతి తెలిసిందే. ఏపీ ప్రభుత్వం తనను ఉద్యోగం నుంచి తొలగించడంపై వెంకట్రామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎన్నికల్లో ఏ పార్టీ తరఫున ప్రచారం చేయలేదని.. ఆధారాలు ఉంటే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. తనను ఉద్యోగం నుంచి తొలగించడంపై సీఎస్‌కు లేఖ ఇస్తానని.. ఒకవేళ స్పందించకపోతే కోర్టును ఆశ్రయిస్తానన్నారు వెంకట్రామిరెడ్డి.ఏపీ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ప్రశ్నించినందుకే.. తనను ఉద్యోగం నుంచి డిస్మిస్ చేశారని చెప్పుకొచ్చారు ఏపీ ఉద్యోగ సంఘం నేత కాకర్ల వెంకట్రామిరెడ్డి . తాను ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీకి అనుకూలంగా ప్రచారం చేసినట్లుగా ఆధారాల ఉంటే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. తాను ఆర్టీసీ డిపోలో ఎన్నికల ప్రచారం చేసినట్లుగా ఆరోపించారని.. ఆ డిపోలో సీసీ ఫుటేజ్ బయటపెట్టాలన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులకు ఇచ్చిన ఏ హామీని నెరవేర్చలేదని.. అందుకే ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారని చెప్పుకొచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు రోడ్డుపైకి వచ్చి ధర్నాలు చేయాలనుకున్న సమయంలో.. వారిని భయపెట్టడానికి తనను డిస్మిస్ చేశారని ఆరోపించారు.తనను ఉద్యోగం నుంచి తొలగించిన అంశంపై సీఎస్‌కు లేఖ ఇస్తానని.. ఈ నిర్ణయంపై పునరాలోచించాలని కోరతానన్నారు వెంకట్రామిరెడ్డి. ఒకవేళ ప్రభుత్వం స్పందించకపోతే కోర్టును ఆశ్రయిస్తానని తేల్చి చెప్పారు. తనకు చంద్రబాబు ఉద్యోగం ఇవ్వలేదని.. లక్షలాది మందితో పోటీపడి ఉద్యోగం సంపాదించానన్నారు. తాను బెదిరింపులకు భయపడేవాడిని కాదని.. పోరాటం కొనసాగిస్తానన్నారు.

తాను ఎన్నికల్లో ఎక్కడా ఏ పార్టీకి ఓటు వేయమని చెప్పలేదని.. గతంలో ప్రస్తుతం ఉన్న ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘ నేతల్ని పక్కన పెట్టుకుని ధర్నాలు చేయలేదా అంటూ వెంకట్రామిరెడ్డి ప్రశ్నించారు. తాను జగన్ బంటును అనుకుంటే అనుకోనివ్వండి.. గత ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చిందని.. ఈ ప్రభుత్వం ఈ రెండేళ్లలో ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యోగులు రోడ్డుపైకి వస్తారనే భయంతో తనను డిస్మిస్ చేశారని.. ఉద్యోగులు అంత అమాయకులు కాదు, తగిన సమయంలో బుద్ధి చెబుతారని ఘాటుగా స్పందించారు.ఎన్నికల సమయంలో తాను తప్పు చేసినట్లు ఎలాంటి ఆధారాలు లేవని.. ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చమని అడిగినందుకే కక్షసాధిస్తున్నారని వెంకట్రామిరెడ్డి ఆరోపించారు. అయినా సరే వెనక్కు తగ్గేదిలేదని.. ప్రభుత్వం ఉద్యోగులకు చేస్తున్న ద్రోహంపై నిలదీస్తూనే ఉంటానన్నారు. ఈ ప్రభుత్వంలో ఇప్పటి వరకు పీఆర్సీ లేదు, ఐఆర్ ఇవ్వలేదన్నారు. కనీసం ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేదన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీల గురించి ప్రశ్నించినందుకు తనను ఉద్యోగం నుంచి తొలగించారన్నారు.

గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కరోనా కష్ట కాలంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నేరవేర్చారని చెప్పుకొచ్చారు.ఏపీ ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డిని ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించింది. 2024 ఎన్నికల సమయంలో కోడ్ ఉల్లంఘించినందుకు ఆయన్ను డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2024 మార్చి 31న వెంకట్రామిరెడ్డి కడప జిల్లాలోని ఆర్టీసీ డిపోల్లో కార్మికులతో సమావేశం నిర్వహించి రాజకీయ ప్రచారం చేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై విచారణ జరిపితే ఆయనపై వచ్చిన ఆరోపణలు నిజమని తేలిందని.. అందుకే ఆయనపై చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వం జీవోలో పేర్కొంది. కడప జిల్లాకు చెందిన కాకర్ల వెంకట్రామిరెడ్డి ప్రస్తుతం పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ విభాగంలో అసిస్టెంట్ సెక్రెటరీగా పనిచేస్తున్నారు. 30 ఏళ్లకు పైగా సర్వీసులో కొనసాగారు. సాధారణ ఉద్యోగిగా ఉద్యోగ జీవితం ప్రారంభించిన వెంకట్రామిరెడ్డి.. సచివాలయ ఉద్యోగుల సంఘంలో కీలక నేతగా ఎదిగారు. ఆయన రెండుసార్లు ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

## సమ్మెకు సద్ధమయిన ఆర్టీసీ కార్మికులు

**- మరో సకల జనుల సమ్మెలాగా చేస్తాం**

**- తెలంగాణ ప్రభుత్వానికి ఆర్టీసీ కార్మిక సంఘాలు హెచ్చరిక**

**హైదరాబాద్** తమ సమస్యలను పరిష్కరించేందుకు అంగీకరించకపోతే బుధవారం ఉదయం నుంచి సమ్మె చేయదానికి ఆర్టీసీ కార్మిక సంఘాలు సిద్ధమయ్యాయి. ప్రభుత్వం దిగిరాకపోతే, సమ్మె విషయంలో వెనకడుగు వేసేది లేదని తేల్చి చెప్పాయి. గతంలో జరిగిన సకల జనుల సమ్మెలాగా చేస్తామని హెచ్చరించాయి. ప్రైవేట్ సిబ్బందితో తమ సమ్మె నిర్వీర్యం చేయాలని చూస్తే ఎలా అడ్డుకుంటామని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న హెచ్చరించారు. సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు మద్దతు ఇస్తున్నాయి. ప్రభుత్వం నుండి సానుకూల స్పందన రాకపోతే 22వ తేదీ మొదటి షిఫ్ట్ నుండి సమ్మె మొదలవుతుందని కార్మిక సంఘాలు వెల్లడించాయి.

## కూటమి నేతల కుమ్ములాటలు

**కోనసీమ** కోనసీమ జిల్లాలో టీడీపీ-జనసేన మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. పి.గన్నవరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద జనసేన, టీడీపీ వాగ్వాదం చోటు చేసుకుంది. ఫ్లెక్సీలో పవన్ కళ్యాణ్ ఫొటో లేదని జనసేన నేతలు ఆగ్రహం వ్యక్తం చేసారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సమక్షంలోనే టీడీపీ- జనసేన నేతల బాహాబాహీ నడిచింది. ద్వాక్రా యానిమేటర్ల్ కు సెల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమంలో వివాదం జరిగింది. పవన్ కళ్యాణ్ లేని ఫ్లెక్సీ తీసేయాలంటూ జనసేన నేతలు డిమాండ్ చేసారు.

## ఎపి సచివాలయంలో

## 18వ సివిల్ సర్వీసెస్ దినోత్సవ వేడుకలు

**అమరావతి,** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో మంగళవారం 18వ సివిల్ సర్వీసెస్ దినోత్సవ వేడుకలు జరుగుతున్నాయి. ఈకార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.వికసిత్ భారత్ స్వర్ణాంధ్ర 2047 సిటిజన్ సెంట్రిక్ గవర్నెన్స్ ఫర్ బెస్ట్ పైల్ డెలివరి అనే నినాదంతో ఈ వేడుకను నిర్వహిస్తున్నారు.అదే విధంగా కార్యక్రమంలో పాల్గొన్న అందరితో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనలో భాగంగా దేశ సమగ్రత, స్వేచ్ఛను కాపాడుతానని, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల ఫలాలు చిట్ట చివరి వ్యక్తి వరకూ సక్రమంగా అందేలా పారదర్శకంగా,నిష్పక్షపాతంగా చిత్త శుద్ధి అంకిత భావంతో పని చేస్తానని సివిల్ సర్వీసెస్ డేడికేషన్ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు,వివిధ శాఖాధిపతులు,ఇతర అధికారులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

## జాతీయ సివిల్ సర్వీసుల దినోత్సవం

**- సివిల్ సర్వెంట్లకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు**

**హైదరాబాద్** జాతీయ సివిల్ సర్వీసుల దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దేశానికి అంకితభావంతో, చిత్తశుద్ధితో సేవలందిస్తున్న సివిల్ సర్వెంట్లందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. నిజాయితీ, క్రమశిక్షణ, ప్రజాసేవ పట్ల అచంచల నిబద్ధతతో వారు నిర్వర్తిస్తున్న బాధ్యతలు దేశ అభివృద్ధి, పురోగతికి దృఢమైన పునాదిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం విధానాల రూపకల్పన, అమలులో సివిల్ సర్వెంట్లు పోషిస్తున్న కీలక పాత్రను కొనియాడుతూ, వారి నిరంతర సేవ సమాజానికి స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి అభినందించారు.

## స్వల్పంగా పెరిగిన భారత వృద్ధి రేటు

**న్యూఢిల్లీ** 2025లో భారత వృద్ధిరేటు 7.4 శాతానికి స్వల్పంగా పెరిగిందని యూఎన్ నివేదిక వెల్లడించింది. 'ఆసియా పసిఫిక్ ఆర్థిక సామాజిక సర్వే-2026' పేరుతో ఐక్యరాజ్యసమితి నివేదిక లో సదరు సమాచారం వెల్లడించింది. ఈ ఏడాది భారత వృద్ధిరేటు 6.4 శాతంగా, 2027లో 6.6 శాతంగా ఉంటుందని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. వినియోగం పెరుగుదల, జీఎస్టీ ధరల తగ్గింపు వృద్ధికి దోహదపడిందని యూఎన్ నివేదికలో వెల్లడించింది.

## సింగపూర్ చేరుకున్న

## మంత్రుల బృందానికి ఘన స్వాగతం

**అమరావతి** మంగళవారం ఉదయం సింగపూర్ చేరుకున్న మంత్రులు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, సత్య కుమార్ యాదవ్, అనగాని సత్య ప్రసాద్, బి.సి. జనార్ధన్ రెడ్డిలకు ఘన స్వాగతం లభించింది. మంత్రుల బృందానికి సింగపూర్ లోని తెలుగు అసోసియేషన్ స్వాగతం పలికింది. ఈ రోజు నుండి ఏప్రిల్ 27 వరకు 7 రోజుల పాటు సింగపూర్లో మంత్రుల బృందం అధికారికంగా పర్యటిస్తోంది. సింగపూర్లో ఆధునిక పరిపాలనా విధానాలను మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధిని మంత్రుల బృందం అధ్యయనం చేయనుంది. సింగపూర్ ప్రభుత్వం ఉ ప్రపంచ బ్యాంక్ తో 'సింగపూర్-ఒఖ జాయింట్ ఇన్స్టిట్యూట్ ఫర్ వరల్డ్ క్లాస్' (ఞఏవిఎఏఅ) అవగాహన ఒప్పందంలో భాగంగా, సింగపూర్ పాలన నమూనా, రాజకీయ జవాబుదారీతనం ఉ నేషన్ ఫస్ట్ వంటి నాయకత్వ సూత్రాలపై నిర్వహించే ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ (ఒఓ) శిక్షణ కార్యక్రమంలో మంత్రులు పాల్గొంటారు.

## మహిళలు, దేశ ప్రజలకు

## తీరని అన్యాయం చేసిన ప్రతిపక్షాలు

**సికింద్రాబాద్.** డీలిమిటేషన్ ప్రక్రియను అడ్డుకోవడం ద్వారా అన్ని పార్టీల కార్యకర్తల బంగారు భవిష్యత్ కు కాంగ్రెస్, ఇండి పక్షాలు అడ్డుకట్ట వేసాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జె రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహేంద్ర హిల్స్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ డీ లిమిటేషన్, మహిళా బిల్లును వ్యతిరేకించడం ద్వారా ప్రతిపక్షాలు మహిళలకే కాదు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలతో పాటు దేశ ప్రజలకు తీరని అన్యాయం చేశాయని తెలిపారు. ఏ పార్టీ ఎదుగుదలకైనా, ప్రజాప్రతినిధులు చట్ట సభలలో అడుగు పెట్టాలన్నా కార్యకర్తలదే కీలక పాత్రఅని పేర్కొన్నారు. డీ లిమిటేషన్ వలన సీట్లు పెరగడం ద్వారా తమకు కూడా అవకాశం వస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ కార్యకర్తల ఆశలపై నీళ్లు చల్లారని వెల్లడించారు. అందుకే పార్టీలకతీతంగా అన్ని పార్టీల కార్యకర్తలు ఏకమై ఈ దుశ్చర్యకు వ్యతిరేకంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు.

### అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్ వైజర్ లకు

### సెల్ ఫోన్ లను అందించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

**సికింద్రాబాద్** స్త్రీ శిశు సంక్షేమ శాఖ నుంచి కేటాయించిన మొబైల్ స్మార్ట్ ఫోన్ లను 29 మంది అంగన్వాడీ టీచర్లకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ మంగళవారం పికెట్ లోని తన కార్యాలయంలో తన చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లతో మాట్లాడుతూ గర్భిణీ బాలింతలు పిల్లల వివరాలు పోషణ్‌ట్రాకర్ పంపిణీ వివరాలు ఆన్లైన్ నమోదు చేయడానికి ప్రభుత్వం శిశు సంక్షేమ శాఖ నుండి ఈ మొబైల్ ఫోన్ లను అంగన్వాడీ టీచర్లకు అందిస్తున్నారని అంగన్వాడీ సేవలలో ఎటువంటి లోపాలు లేకుండా అందించాలని కోరారు. పోషణ మాసం సందర్భంగా పోస్టర్లను రిలీజ్ చేసి సరైన పోషణ ఆరోగ్య తెలంగాణను నిర్మించడానికి అంగన్వాడీ వృత్తి మరింతగా కృషి చేయాలని కోరారు. అంగన్వాడి సెంటర్ లోని సమస్యలను తెలుసుకొని పరిష్కారం కొరకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఐఆర్ ప్రాజెక్ట్ అధికారిణితో ఓ.సృష్ణ , బ్లాక్ కోఆర్డినేటర్ సరిత , అంగన్వాడి టీచర్లు ఇతరులు పాల్గొన్నారు

## మచిలీపట్నం జీజీహెచ్‌లో మంత్రి ఆకస్మిక తనిఖీలు

**- సిబ్బందిపై ఆగ్రహం**

**మచిలీపట్నం** మచిలీపట్నం జీజీహెచ్ ను మంత్రి కొల్లు రవీంద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. బైక్ పై వచ్చిన మంత్రి ఆస్పత్రికి రాగానే అస్తవ్యస్తంగా పార్కింగ్ చేసిన వాహనాలను చూసి సెక్యూరిటీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఓపీ విభాగాన్ని పరిశీలించారు. ఓపీలో రోగులు ఎక్కువ మంది ఉండటాన్ని గమనించిన మంత్రి కౌంటర్ల సంఖ్య పెంచాలని సూపరింటెండెంట్ ను ఆదేశించారు. ప్రతి విభాగానికి వెళ్లి వైద్యులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు.

## అంగన్వాడీ టీచర్లకు సెల్ ఫోన్లు

## పంపిణీ చేసిన మంత్రి వివేక్

**చెన్నూరు** చెన్నూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంగన్వాడీ టీచర్లకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సెల్ ఫోన్లను మంత్రి వివేక్ వెంకటస్వామి పంపిణీ చేపారు. , వాటిని సద్వినియోగం చేసుకుని విధులు నిర్వహించాలని సూచించాచారు. తరువాత రం 37 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ప్రజా పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతోంది. ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు అర్హులకు అందుతున్నాయి. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై భారీగా ఖర్చు చేసి ప్రజల సొమ్మును వృథా చేసింది. నిన్న నేను సీఎం రేవంత్ రెడ్డి గారితో కలిసి ప్రాజెక్టును సందర్శించాను. నిధులపై మాట్లాడేవారు ముందుగా అభివృద్ధి ఎందుకు చేయలేదో చెప్పాలి. అభివృద్ధి చేయలేకపోయినందుకే ప్రజలు తిరస్కరించారని అన్నారు.సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలు చేస్తున్న వారిని ప్రజలు గమనిస్తున్నారు. నేను గెలిచిన తర్వాత అనేక అభివృద్ధి పనులు ప్రారంభించాను. చెన్నూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాను. యువతకు ఉపాధి కల్పించేందుకు జర్మనీ సంస్థ టామ్ కామ్తో ఒప్పందం కుదుర్చుకున్నాము. జర్మనీలో ఉద్యోగాల కోసం యువకులు మా కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

## మహాత్మా గాంధీ ఉపాధి పనులలో

## అంతులేని అవినీతి

**- కోట్లాది రూపాయలు దోచుకుంటున్న అధికారులు.**

**తుగ్గలి:** గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస పోకుండా నివాసం ఉన్న గ్రామంలోనే వారికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టింది.అయితే కొందరు అధికారులు ఉపాధి సిబ్బంది, ప్రజాప్రతినిధులతో కలిసి అవినీతికి పాల్పడడంతో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అవినీతిలో కూరుకుపోయింది. వివరాలు ఇలా ఉన్నాయి.తుగ్గలి మండలంలొ 2025 ఏప్రిల్ నుండి 2026 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పనులలో భారీ అవినీతి చోటుచేసుకుంది.తుగ్గలి మండలంలో రాతన,తుగ్గలి,గిరిగెట్ల,జొన్నగిరి,జి. ఎర్రగుడి,ఉప్పర్లపల్లి,సూర్య తాండ, మిాటే తాండ,చిగుర్లగుట్ట తాండ, ఎల్లమ్మగుట్ట తాండ,కడమకుంట్ల, రాంపురం,పగిడిరాయి,చెన్నంపల్లి, శభాష్ పురం,రాంపల్లి,రాంకొండ, మారెళ్ళ,ముక్కెళ్ళ,నునుసురాళ్ళ, బొందిమడుగుల,పెండేకల్లు, ఎద్దులదొడ్డి గ్రామ పంచాయతీలు ఉన్నాయి.ప్రతి గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్,సీనియర్ మేటీలు ఉన్నారు. వ్యవసాయ పనులు పూర్తి అయిన తరువాత ఫిబ్రవరి లేదా మార్చి నెలలో వ్యవసాయ కూలీలు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులకు వెళ్ళేవారు.ఫీల్డ్ అసిస్టెంట్,సీనియర్ మేటీలు ఉపాధి పనులకు వెళ్లిన వారికి రోజు మస్టర్లు వేసేవారు.టెక్నీకల్ అసిస్టెంట్,ఈసీ లు వారానికి ఒకసారి ఉపాధి పనులు చేసిన ప్రాంతానికి వెళ్ళి,కొలతలు తీసుకుని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేసిన పనులకి యం బుక్ రాస్తారు. ఏపీవో వాటిని కంప్యూటరించేందుకు అనుమతి ఇస్తాడు.కంప్యూటర్ ఆపరేటర్ మాస్టర్లను,యం బుక్ రికార్డ్ లను కంప్యూటర్ లొ ఫీడ్ చేస్తాడు. మండల అభివృద్ధి అధికారి ఉపాధి కూలీలకు వేతనం మంజూరు చేయాలని తన లాగిన్ లొ అప్లోడ్ చేస్తాడు.అక్కడి నుండి ఏపీడీ లాగిన్ కి, అక్కడి నుండి పీడీ లాగిన్ కి వెళ్ళి, ఒక్కొక్క మెట్టు ఎక్కుకుంటూ కేంద్ర ప్రభుత్వానికి చేరుతాయి.వారు నిధులు మంజూరు చేస్తే నేరుగా ఉపాధి కూలీ అకౌంట్ కి వేతనాలు జమ అవుతాయి.ఇది అంతా ఉపాధి పనులకు వెళ్లే వారికి మాత్రమే సుమా.ఏపీడీ,ఎంపీడీఓ, ఏపీవో,ఈసీ,టెక్నీకల్ అసిస్టెంట్లు,ఫీల్డ్ అసిస్టెంట్లు,సీనియర్ మేటీలు,ప్రజా ప్రతినిధులు అందరూ కలిసి కేంద్ర ప్రభుత్వ సొమ్మును కొల్లగొట్టేందుకు ప్రణాళికలు వేసుకున్నారు.ఫీల్డ్ అసిస్టెంట్లు,సీనియర్ మేటీలు కలిసి గ్రామాలలో ఉపాధి పనులకు వెల్లని వారిని కలిసి,మస్టర్లు వేస్తాము,వచ్చిన డబ్బులలో మీరు సగం తీసుకుని మాకు సగం డబ్బులు ఇచ్చే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు.కాంట్రాక్టు ఉద్యోగులకు,ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు, ఆర్.ఎం.పి,పి.ఎం.పి వైద్యులకు, మెడికల్ షాప్ నిర్వాహకులకు, చిరు వ్యాపారులకు,హోటల్ యజమానులకు,కిరణా షాప్ యజమానులకు,ఆటో డ్రైవర్లకు,ట్రాక్టర్ యజమానులకు,రైలు బండ్లలో టీ కాఫీలు,సమోసాలు,వడలు,బిస్కెట్లు, పండ్లు,పూలు,చిప్స్ అమ్ముకునే వారికి, ప్రైవేట్ కంపెనీలో పనిచేసే వారికి, ఇతర ప్రాంతాలలో కాలేజీలలో చదువుతున్న వారికి,పెళ్ళై మెట్టింటికి వెళ్ళిన మహిళలకు,ప్రజాప్రతినిధులకు, ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులకు, రాజకీయ నాయకులకు, వారి చుట్టూ తిరిగే మనుషులకు వంద రోజులు మస్టర్ల ను వేస్తున్నారు.వారికి ఎలాంటి కొలతలు తీసుకోరు.నిబంధనల ప్రకారం పూర్తి వేతనం వచ్చేవిధంగా టెక్నీకల్ అసిస్టెంట్ యం బుక్ రాయడం,ఈసీ చెక్ మేజర్ చేయడం,ఏపీవో సంతకం చేయడం,ఆపరేటర్ కంప్యూటర్ చేయడం, ఎంపీడీఓ,ఏపీడీ లాగిన్ లొ అప్లోడ్ చేయడం వంటి పనులు చకచక జరిగిపోయాయి.ఫలితంగా అధికారులు,ఉపాధి సిబ్బంది దాదాపు ఇరవై కోట్ల రూపాయలు లూటి చేశారు.

## జొన్నగిరి గోల్డ్ మైన్స్ కి సంబంధించి పెండింగ్ లో ఉన్న

## భూ సేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయండి

**- జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



**తుగ్గలి:** జొన్నగిరి గోల్డ్ మైన్స్ కి సంబంధించి పెండింగ్ లో ఉన్న భూ సేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పత్తికొండ ఆర్డీఓ ను ఆదేశించారు. మంగళవారం తుగ్గలి మండలంలోని జియో మైసూర్ సర్వీసెస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ జొన్నగిరి గోల్డ్ మైన్స్ ను కలెక్టర్ సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా ప్లాంట్ లో ప్రారంభ దశ నుండి బంగారం ఉత్పత్తి అయ్యే చివరి దశ వరకు ఉన్న ప్రతి ఒక్క విభాగాన్ని కలెక్టర్ క్షుణ్ణంగా ప్లాంట్ మొత్తం తిరిగి పరిశీలించారు. సందర్శన అనంతరం పరిశ్రమల శాఖ, ఏపీఐఐసి జెడ్ ఎం లతో,సంస్థ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు.పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ పత్తికొండ ఆర్డీవో, తుగ్గలి తహశీల్దార్ లను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి పత్తికొండ ఆర్డీఓ మరియు ఏపీఐఐసి జెడ్ ఎం మధుసూదన్ రెడ్డి,పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జవహర్,తుగ్గలి తహశీల్దార్ రవి కుమార్, మండల సర్వేయర్ సుధాకర్, మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు, మండల విద్యాధికారి రమా వెంకటేశ్వర్లు,పంచాయతీ కార్యదర్శులు నారాయణ స్వామి,రాజు నాయక్,వీఆర్వో రంగన్న,సంస్థ ప్రతినిధులు బాలాజీ,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంబటిపై మరో కేసు

**గుంటూరు,** గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ మంత్రి అంబటి రాంబాబుపై మరో కేసు నమోదైంది. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని గుంటూరు నగరంపాలెం పోలీసులు అంబటి రాంబాబుపై కేసు నమోదు చేశారు. కొన్ని రోజుల కిందట తన ఇంటిపై దాడి చేసిన వారిని అరెస్టు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ గుంటూరు కలెక్టరేట్ ఎదురుగా అంబటి రాంబాబు శనివారం (ఏప్రిల్ 18న) దీక్ష చేపట్టారు. అయితే ఎలాంటి అనుమతి లేకుండా నిరసన దీక్ష చేపట్టి, ట్రాఫిక్‌కు అంతరాయం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలిగించారని గుంటూరు పోలీసులు చర్యలు చేపట్టారు.తన నివాసంపై జరిగిన దాడికి నిరసనగా మాజీ మంత్రి అంబటి రాంబాబు శనివారం గుంటూరు కలెక్టరేట్ వద్ద దీక్ష చేపట్టారు. ఇటీవల తన ఇంటిపై దాడి చేసిన టీడీపీ కార్యకర్తలను వెంటనే అరెస్ట్ చేయాలని, కస్టడీలో తనను హింసించిన పోలీసులపై సైతం చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. అయితే, ఈ దీక్షకు ముందస్తు అనుమతి లేదని, దీనివల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిందన్న కారణంతో గుంటూరు నగరంపాలెం పోలీసులు అంబటి రాంబాబుపై కేసు నమోదు చేశారు. ఈ కేసుపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఉద్దేశపూర్వకంగా వైసీపీ నేతల్ని ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు.దీక్షలో భాగంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. 'తన ఇంటిపై దాడి జరిగినప్పుడు పోలీసులు అక్కడే ఉన్నా పట్టించుకోలేదు. పైగా నన్ను 18 రోజుల పాటు రాజమండ్రి జైల్లో పెట్టి ఇబ్బందులకు గురిచేశారు. కానీ నా ఇంటి మీద దాడి చేసిన వారిని కనీసం 18 నిమిషాలు కూడా జైల్లో పెట్టలేదు. గుంటూరులో ఇళ్లపై దాడులు చేసే కొత్త సంస్కృతిని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తీసుకువచ్చారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఆదేశాలతోనే ఈ దాడులు జరుగుతున్నాయని' ఆరోపించారు.టీడీపీ నేతల బెదిరింపులకు తాను భయపడే ప్రసక్తే లేదని, ప్రాణాలకు తెగించైనా చట్టపరంగా పోరాటం చేస్తానని అంబటి రాంబాబు స్పష్టం చేశారు. పోలీసు స్టేషన్‌లో తనను హింసించే ప్రయత్నం చేశారన్న ఆయన, ఈ అన్యాయాలపై న్యాయపోరాటంతో పాటు ప్రజాపోరాటానికి సైతం సిద్ధమని హెచ్చరించారు. తనది ధర్మపోరాటమని, తనపై, ఇంటిపై దాడికి బాధ్యులైన ఎవరినీ వదిలిపెట్టేది లేదని ఆయన స్పష్టం చేశారు.

## ఓల్డ్ సిటీలో జంట హత్యలు

**హైదరాబాద్,** హైదరాబాద్ శివార్లలోని సుల్తాన్‌పూర్ ప్రాంతంలో జరిగిన జంట హత్యలు స్థానికంగా కలకలం రేపాయి. శంషాబాద్ జోన్ డిసిపి బి. రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏప్రిల్ 20వ తేదీ సాయంత్రం సుమారు 6 గంటల ప్రాంతంలో నగరంలోని పాతబస్తీ మీర్ చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో హత్య జరిగిందని సమాచారం పోలీసులకు అందింది. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.అజ్మీరా, అకీల్ అనే వ్యక్తులు తమ నివాసంలోనే మృతదేహాలుగా కనిపించారు. స్థానికుల సమాచారం ప్రకారం మృతుల సొంత సోదరుడే ఈ దారుణానికి పాల్పడి ఉండవచ్చని పోలీసులు ప్రాథమిక విచారణలో అనుమానిస్తున్నారు. కుటుంబ కలహాలు లేదా మరేదైనా కారణంతో ఈ హత్యలు జరిగాయా అనే కోణంలో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు.

## ఏపీ ప్రభుత్వం కేంద్రానికి

## లేఖ రాయడం మాయ మాటే..

**- బొలిశెట్టి సత్యనారాయణ**

**హైదరాబాద్** కొల్లేరు సరిహద్దుల అంశంపై కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది. అభయారణ్యం పరిధి నుంచి ఆ 20వేల ఎకరాలను మినహాయించాలని కోరింది. అయితే ఈ లేఖపై జనసేన పార్టీ నేత బొలిశెట్టి సత్యనారాయణ స్పందించారు. కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాయడం మాయ మాటే అంటూ బాంబ్ పేల్చారు. ఏపీ ప్రభుత్వం మళ్లీ పాత పాటే పాడిందంటూ బొలిశెట్టి ఘాటుగా స్పందించారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొల్లేరుకు సంబంధించిన అంశాలపై కేంద్రానికి లేఖ రాసింది. కొల్లేరు వన్యప్రాణి అభయారణ్యం సరిహద్దుల మార్చేందుకు అనుమతించాలని కోరింది. అభయారణ్యం పరిధి నుంచి 20 వేల ఎకరాల జిరాయితీ, డీ-పట్టా భూముల్ని మినహాయించాలని కోరింది. ఏపీ కేబినెట్‌లో ఫిబ్రవరి 24న చేసిన తీర్మానాన్ని లేఖలో ప్రస్తావించారు. ఈ మేరకు కేంద్ర సాధికార కమిటీ సభ్య కార్యదర్శికి రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే లేఖ రాశారు.

అయితే ఏపీ ప్రభుత్వం కేంద్రానికి రాసిన లేఖపై జనసేన పార్టీ నేత బొలిశెట్టి సత్యనారాయణ స్పందించారు.కొల్లేరు సరిహద్దులపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసిందని చెప్పడం పూర్తిగా మాయ మాటగా అభిప్రాయపడ్డారు బొలిశెట్టి సత్యనారాయణ. ఏపీ ప్రభుత్వం కేంద్ర సాధికార కమిటీకి (సెంట్రల్ ఎంపవర్మెంట్ కమిటీ) పంపిన లేఖను ప్రస్తావిస్తూ ట్వీట్ చేశారు. తాజాగా ఏపీ ప్రభుత్వం కేంద్రానికి రాసిన లేఖలో కొత్తగా ఏమీ లేదని.. 2018 నుంచి పాడుకుంటూ వస్తున్న గత ప్రభుత్వాల పాత పాటే అంటూ విమర్శించారు. గతంలో పంపిన అసెంబ్లీ తీర్మానం మరోసారి సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ కి పంపారని.. పాత పాటే మళ్లీ పాడారని ధ్వజమెత్తారు.'2018 మార్చి 27న జరిగిన ఔఃచిఒ 48వ స్టాండింగ్ కమిటీ మీటింగ్ మినిట్స్ చూస్తే.. జాతీయ వన్యప్రాణి బోర్డు వన్యప్రాణులను కాపాడేందుకా? లేక చేపల చెరువుల వ్యాపారవేత్తల వ్యాపార ప్రయోజనాలను కాపాడేందుకా?' అనే అనుమానం తప్పక వస్తుందన్నారు. రాష్ట్రంలో విశాఖపట్నం నుంచి నెల్లూరు వరకు అనేక తీర ప్రాంతాల్లో సముద్రపు నీరు భూములోకి దాదాపు 40 నుంచి 60 కిలోమీటర్ల వరకు చొచ్చుకొని రావడానికి గల కారణాల గురించి చెబుతానన్నారు. రాష్ట్రంలోని తీర ప్రాంత భూముల సంరక్షణ కోసం తీసుకోవాల్సిన కఠిన నిర్ణయాలతో, మరికొన్ని ఆశ్చర్యపరిచే వాస్తవాలతో మీడియా ముందుకు త్వరలో వస్తానని చెప్పుకొచ్చారు బొలిశెట్టి సత్యనారాయణ.ఏపీ ప్రభుత్వం కేంద్రానికి రాసిన లేఖలో కీలక అంశాలను ప్రస్తావించించింది. కొల్లేరు అభయారణ్యంలో దాదాపు 20వేల ఎకరాల జిరాయితీ, డీ పట్టా భూములు ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించినవని లేఖలో తెలిపారు. ఆ భూముల్ని కొనసాగిస్తూ సరిహద్దులు నిర్ణయించడాన్ని స్థానికులు వ్యతిరేకిస్తున్నారని ఏపీ ప్రభుత్వం గుర్తు చేసింది.

గతంలో జరిగిన అంశాలను ప్రస్తావించి.. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్య పరిష్కరించేందుకు సహకరించాలని కోరారు. కొల్లేరు అభయారణ్యం సరిహద్దుల మార్పునకు ఏపీ కేబినెట్ తీర్మానం చేసిందని.. అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్ర సాధికార కమిటీకి ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది. ఈ లేఖను ప్రస్తావిస్తూ బొలిశెట్టి సత్యనారాయణ ప్రభుత్వ తీరుపై విమర్శలు చేశారు.జనసేన పార్టీలో ఉన్న బొలిశెట్టి సత్యనారాయణ కొంతకాలంగా కొల్లేరు సమస్య, తీర ప్రాంత భూములు, పర్యావరణ సమస్యలపై పోరాటం చేస్తున్నారు. ఈ క్రమంలో పర్యావరణానికి సంబంధించి ఏపీ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వంపై దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరుగుతోంది. అయితే పర్యావరణశాఖ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పరిధిలోకి వస్తుంది కాబట్టి ఆయన జనసేన పార్టీ పదవులకు రాజీనామా చేశారు.. తాను కేవలం పార్టీ కార్యకర్తగా మాత్రమే ఉంటానన్నారు. అయితే తాజాగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పరిధిలోని అటవీశాఖ నుంచి కేంద్రానికి రాసిన లేఖపై విమర్శలు చేయడం చర్చనీయాంశమైంది.

## మంచిర్యాల రైల్వే స్టేషన్‌ను
# పరిశీలించిన ఎంపి వంశీ కృష్ణ



**మంచిర్యాల** పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ మంగళవారం మంచిర్యాల రైల్వే స్టేషన్ను సందర్శించి, అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను సవివరంగా పరిశీలించారు. పనుల నాణ్యతపై ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేస్తూ, ప్రతి పని సమయానికి పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు సురక్షితమైన, ఆధునిక సౌకర్యాలు అందించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, కూర్చునే సదుపాయాలు, లైటింగ్, పార్కింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదనంగా, వృద్ధులు, మహిళలు, దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రయాణికుల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు స్పందించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, డీసీపీ, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.4.61 కోట్ల కళ్యాణ లక్ష్మి
# షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

- డంపింగ్ యార్డ్ రద్దు వరకు పోరాటం కొనసాగుతుంది
- పథకాల పేర్లు మార్చినా పర్లేదు పేదల పథకాలు నిలిపివేయొద్దు
- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి




**హుజురాబాద్** హుజురాబాద్ పట్టణంలోని సిటీ సెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో 461 మంది లబ్ధిదారులకు రూ.4,61,53,473 విలువైన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో గణనీయమైన మార్పులు తీసుకువచ్చాయని అన్నారు.

పథకాల పేర్లు మార్చినా పర్లేదు కానీ పేదలకు మేలు చేసే పథకాలను నిలిపివేయడం సరికాదని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఆడబిడ్డల భవిష్యత్తు కోసం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్తో పాటు తులం బంగారం ఇవ్వాలి అని ప్రభుత్వం కోరారు.గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గర్భిణీ స్త్రీలకు న్యూట్రిషన్ కిట్లు, ప్రసవం అనంతరం కేసీఆర్ కిట్లు అందించి పేద కుటుంబాలకు పెద్ద ఎత్తున సహాయం చేసినట్లు గుర్తు చేశారు. అలాంటి సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించాలని కోరారు.అదే విధంగా హుజురాబాద్లో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్ ఏర్పాటుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, ఈ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, జీవన విధానం తీవ్రంగా దెబ్బతింటుందని అన్నారు. డంపింగ్ యార్డ్ రద్దు అయ్యే వరకు ప్రజలతో కలిసి ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, లబ్ధిదారులు మరియు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## జగిత్యాలకు యూఐడిఎఫ్
# నిదులు కేటాయించండి



**హైదరాబాద్** జగిత్యాల శాసనసభ్యుడు డాక్టర్ సంజయ్ కుమార్ మున్సిపల్ అభివృధి విషయంలో ప్రిన్సిపాల్ సెక్రెటరీ (అఆఓ) శ్రీదేవి ని కలిసి యూఐడిఎఫ్ ఫండ్స్ లో విదివిదానాలగురించి మరియు అందులో ఉన్న జాప్యలగురించి, యు జగిత్యాల మున్సిపల్ లో సిబ్బంది కోరత ఉందని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన శ్రీదేవి తొందర్లోనే వీటన్నిటికి పరిష్కారం చూపిస్తామని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి జగిత్యాల లో జరుగుతున్న వివిధ రాజకీయ పరిణామాల గురించి కూడా చర్చించారు. జగిత్యాల లో వివిధ అభివృద్ధి పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని కోరగా వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. తొందర్లోనే జగిత్యాల నియోజకవర్గానికి వస్తానని చెప్పడం జరిగింది..


## ఆకు చాటున పిందె, మార్కెట్లో
# కూరగాయల చాటున మందె

- బోయిన్ పల్లి మార్కెట్ లో "39"లైసెన్స్ తో ముప్పు: చైర్మన్
- అక్రమ వ్యాపారస్తులను జల్లెడ పడుతున్న మార్కెట్ అధికారులు
- గత వారం రోజుల క్రితం నోటీసులు, నిన్న సమావేశం
- మరో వారం పొడిగింపు అయిన మారకపోతే "లైసెన్స్" లు రద్దు.?
- జాడ,నీడ లేదు ముసపేట్ కేరాఫ్ గా కిరాయిలు, వరుస దాడులతో నిజాలు వెలుగు
- 1932 పార్టనర్ షిప్ పేరుతో మోసాలకు తెర లేపిన జాదుగాళ్ల "జాతకం" రెఢీ.
- సిబ్బంది చేతి వాటం పై సీరియస్ అయిన చైర్మన్.
- ఇక విధుల్లో జాగ్రత్తలు, లేని పక్షంలో శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించిన చైర్మన్
- ఏరియా సూపర్వైజర్లు ఇక తస్మాత్ జాగ్రత్త, నకిలీల బాధ్యత మీదే, అనుమానం వస్తే "తక్ పట్టి"స్వాధీనం - చైర్మన్
- త్వరలో మిగితావి ప్రక్షాళన, వ్యవసాయ చట్టం ప్రకారమే చర్యలు.









కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) గత ఐదు నెలలుగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో మార్కెట్ అధికారులు, పాలకమండలి చెత్త సమస్యతో బాధపడుతున్నారు.ఓ పక్క ప్రతి రోజూ టన్నుల కొద్దీ మార్కెట్ లో కూరగాయల వ్యర్థాలతో కుప్పలు కుప్పలుగా నిండిపోతుంది. దీన్నీ డంపింగ్ యార్డ్ కు తరలించాలంటే కత్తి మీద సాము గా ఏర్పడన వైనం.ఈ మధ్య బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు తన వ్యక్తిగత సొమ్ముతో కొన్ని రోజులు మార్కెట్ లో చెత్తను జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ కు తరలించిన విషయం విదితమే. మరో పక్క కొత్తగా బాధ్యతలు చేపట్టిన సెక్రటరీ ఈ.వెంకటేశం యార్డ్ లో పేరుకు పొయినా కూరగాయల వ్యర్థాలను తొలగించడంలో నిత్యం ఫైట్ చేస్తున్నారు. ఒక వైపు ఫైనాన్స్ డిపార్ట్మెంట్ నుంచి నిధులు మంజూరు గాక,మరో వైపు గుత్తేదారు జాడలేక, సొంతంగా చెత్త చెదారం ఎత్తే పనిలో నిమగ్నమయ్యారు మార్కెట్ సెక్రటరీ.సగటున డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ కి నిత్యం పదిహేడు రాష్ట్రాల నుంచి ఇరవై ఏడు టన్నుల కూరగాయలు దిగుమతి అవుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. అందులోను విక్రయాలకు ఆటంకాలు ఎదురైనా,వ్యాపారం సరిగ్గా లేకపోయినా గంటల వ్యవధిలోనే టన్నుల కొద్దీ కూరగాయలు చెత్త కుండీలకి కేరాఫ్ గా నిలుస్తున్నాయి. ఇలా ప్రతి రోజూ బోయిన్ పల్లి మార్కెట్ లో ఎనిమిది నుంచి పదకొండు టన్నుల కూరగాయలు వ్యర్థాలు కుప్పలు తెప్పలుగా కన్పిస్తున్నాయి. వీటిని తొలగించడంలో అధికారులు తలమునకలై ఉన్నారు.

### బోయిన్ పల్లి మార్కెట్ లో "39" లైసెన్స్ తో ముప్పు పొంచి ఉందా.?

సికింద్రాబాద్ మోండా మార్కెట్ నుంచి విడిపోయి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ గా నామకరణం చేసిన సర్కార్. ఇది 2001 డిసెంబర్ 20 న తిరుమల గిరి మండలంలో సర్వే నెంబర్ 81,82 పీ లో ఉన్న 21 ఎకరాల 23 గుంటల స్థలాన్ని వ్యవసాయ శాఖకు అప్పగించిన విషయం అందరికి తెలిసిందే. అదే ఈ రోజు బోయిన్ పల్లి మార్కెట్ గా అందుబాటులో ఉంది. అయితే అసలు గుట్టు ఇక్కడే ఉంది.మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు జారీ చేసిన లైసెన్స్ లు "174". అందులో 2013 లో అప్పటి మంత్రి ముఖేష్ గౌడ్,అధికారులు జారీ చేసినవి "42". ఈ నలభై రెండు లైసెన్స్ పై పెద్ద యుద్ధమే జరిగింది.ధర్నా, నిరసనలు వెల్లువెత్తాయి. కాలక్రమేనా అందరూ మరిచి పోయి వ్యాపార లావాదేవీల్లో మునిగి పోయారు.అంత బాగుంది అనుకునే లోపే "39"లైసెన్స్ లకు కీలక భూమిక పోషించిన "బస్వరాజు".ఈయన నేతృత్వంలో అందరు కలిసి కోర్టును ఆశ్రయించారు.

అప్పటి నుంచి కోర్టు వివాదాల్లో ఉన్న అంశాన్ని అధికారులు ఎక్కువగా శ్రద్ధ వహించలేదు.అదికాస్త "వటుడు ఇంతింతై ఆకాశం అంతా నాదే అన్నట్లు, "39"లైసెన్స్ దారుల ఆగడాలు రోజురోజుకు శృతి మించాయని మార్కెట్ అధికారులు తెలిపారు.ఈ నేపథ్యంలో మార్కెట్ యంత్రాంగం,కమిటీ"39" పై ఫుల్ ఫోకస్ చేస్తూ,గత వారం నుంచి ఈ నెల ఏప్రిల్ 20 న "39"లైసెన్స్ దారులతో అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. తప్పనిసరిగా అందరు హాజరు కావాలని,లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.ఇదే క్రమంలో నిన్న సోమవారం ఉదయం 11:30 నిమిషాలకు"39" లైసెన్స్ దారులు ఒక్కొక్కరిగా కార్యాలయానికి చేరుకున్నారు.కొందరు ముసుగు తీయలేక మార్కెట్ పెద్దలను ఆశ్రయించారు.

### చైర్మన్,సెక్రటరీ "39" లైసెన్స్ దారులు పై ఆరా

బోయిన్ పల్లి మార్కెట్ లో ముసపేట్ లైన్లో అసలు నకిలీ పై అధికార యంత్రాంగం నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్న విషయం విదితమే. కానీ మార్కెట్ అధికారులకు దిమ్మ తిరిగే విషయాలు వెలుగు చూశాయి. ఈ క్రమంలో కమిటీ సూచన మేరకు యుద్ధప్రాతిపదికన "39" లైసెన్స్ దారులతో సమావేశం ఏర్పాటు చేయాలి,అప్పుడే అలాటిలు,కిరాయి దారులు, మార్కెట్ కి సంబంధం లేని వ్యక్తులు ఎవరిని తెలుస్తోందని కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు అధికారులతో వెల్లడించారు. ఈ నేపథ్యంలో నిన్నటి సమావేశంలో పాల్గొన్న కమీషన్ ఏజెంట్లు మరో వారం రోజులు గడువు కావాలని అడగడంతో, సానుకూలంగా స్పందించిన ఛైర్మన్. ఒకవేళ ఏడు రోజుల్లో వివరాలు అందజేయకపోతే "తక్ పట్టి"ఎంట్రీ ఆగిపోతుందన్నారు. ఇప్పటికైనా మార్కెట్ కి సంబంధం లేని వ్యక్తులు అధికారులను సంప్రదించి వాస్తవాలు వెల్లడిస్తే వారికే మంచిది,సిఫార్సుల పేరుతో చికాకు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు మార్కెట్ పాలకమండలి ఛైర్మన్ ఆనంద్ బాబు.అలిగే వీటి కన్నింటికి సూత్రధారి, పాత్రధారిని గుర్తించాం, అక్రమ రిజిస్ట్రేషన్లు,పార్టనర్ షిప్ పేరుతో అమాయకులను మోసిన వ్యక్తి పై త్వరలో "తిరుమల గిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసే ఆలోచనలో ఉన్నట్లు అధికారులు,ఛైర్మన్ తెలిపారు.మరో ముఖ్య విషయం ఏమిటంటే వర్జినల్ లైసెన్స్ దారుడు స్థానంలో మరెవరైనా ఉంటే వేంటనే వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు ఆనంద్ బాబు.

### అసోసియేషన్ పెద్దలకు ఆహ్వానం లేదు:చైర్మన్

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో కొందరు చేస్తున్న మోసాలను గుర్తించాం.అందుకే గత వారం రోజుల క్రితం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. అందులో భాగంగా ముసపేట్ లైన్లో లైసెన్స్ లు లేక కొంత మంది కూరగాయల వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారు. అదిగాక గుర్తు తెలియని వ్యక్తులు కూడా మార్కెట్లో వ్యాపారం చేయడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి.ఈ విషయంలో నిజమైన లబ్ధిదారులు (లైసెన్స్ దారులు) గుర్తించే వరకు ముసపేట్ లైన్లో అధికారుల తనిఖీలు తప్పవని హెచ్చరించారు బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు.మరో విషయం ఏమిటంటే సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి కి మేము సమాచారం ఇవ్వలేదు, అయిన "79"ఏళ్ల పెద్దాయనా వస్తే కాదనలేక, ఆయనతో పూర్తి స్థాయిలో ముసపేట్ లైన్లో జరుగుతున్న బాగోతం గురించి వివరించాము. అసోసియేషన్ అధ్యక్షుడిగా సహకరిస్తారో లేక "39"మంది కమీషన్ ఏజెంట్లు వాస్తవాలతో వచ్చే వారం జరిగే సమావేశంలో సహకరిస్తారని హామీ ఇచ్చారు సోమ దేవేందర్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు పేర్కొన్నారు.మరో విషయం ఏమిటంటే ఇంతటితో ఆగదు మిగతా వారి పై కూడా అధికారుల తనిఖీలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేవేందర్ (దేవుడు) సెక్రటరీ ఈ.వెంకటేశం, యార్డ్ ఇంచార్జ్ గ్రేడ్ టూ జె.సత్యనారాయణ, లైసెన్స్ విభాగం అధికారి మహ్మద్ రఫీక్,ఖలీద్, మార్కెట్ అసిస్టెంట్ సెక్రటరీ మేడ్చల్ శ్రీనివాస్,సాయి తదితరులు పాల్గొన్నారు.



# గ్యాస్ దొంగల రాజ్యం నడుస్తోందా.?

## డంకాబజాయిస్తున్న గ్యాస్ సిలిండర్ ధరలు

- బ్లాక్ మార్కెట్ మాఫియా బహిరంగ దందా
- కొరత పేరుతో కోట్ల దందా ప్రజలపై గ్యాస్ భారాల మోత
- అధికారులు నిర్లక్ష్యంతో కొరత కాదు, ఇది కృత్రిమ దందా
- ప్రజల జేబులు ఖాళీ చేస్తున్న గ్యాస్ మాఫియా,
- నియంత్రణ లేకపోతే పరిస్థితి ఆందోళనకరం
- ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ప్రజల నిరసనలు తప్పవు

(గౌటి రామకృష్ణ- ప్రశ్న న్యూస్)



గ్రేటర్ హైదరాబాద్ నగరంలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అధికారిక ధరలు ఒకట్టైతే, బ్లాక్ మార్కెట్‌లో మరొక రేటు అమలవుతోంది. చిన్న సిలిండర్ రూ.3500 దాటుతుండగా, పెద్ద సిలిండర్ రూ.5500 పైగానే బహిరంగంగా విక్రయిస్తున్నారు. "కొరత" అనే నెపంతో డీలర్లు దోపిడి చేస్తూ సామాన్య ప్రజలను, చిన్న వ్యాపారులను దోచుకుంటున్నారు. అయిన ఇప్పటివరకు సివిల్ సప్లై అధికారులు దాడులు చేసి కఠినంగా వ్యవహరించకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది.

### సివిల్ సప్లై శాఖ నిర్లక్ష్యం, దందాకు రహదారి

తెలంగాణ వ్యాప్తంగా గ్యాస్ సరఫరా సమృద్ధిగా ఉన్నప్పటికీ, డీలర్లు కావాలనే స్టాక్ దాచిపెట్టి బ్లాక్ మార్కెట్‌కు మళ్లిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సివిల్ సప్లై సప్లై అధికారులు కళ్లుమూసుకుని కూర్చోవడం వల్ల ఈ అక్రమ వ్యాపారం రోజురోజుకు పెరుగుతోంది. ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడం ప్రజల్లో ఆగ్రహాన్ని రగిలిస్తోంది. గృహ ఉపయోగాలకు ఉపయోగించే సిలిండర్లను కమర్షియల్ గా 3500కు పైగా అమ్ముకుంటున్నారు ఇది తెలిసిన గత అధికారులు మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది.




### కోట్లు దోచుకుంటున్న గ్యాస్ మాఫియా..

గ్రేటర్ హైదరాబాద్‌లో కొంతమంది గ్యాస్ డీలర్లు ఈ అక్రమ దందాతో నెలకు కోట్లు సంపాదిస్తున్నారనే సమాచారం బయటకు వస్తోంది. అమెరికా ఇరాన్ యుద్ధం జరుగుతుందన్న కారణంతో డీలర్లు కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచడం సర్వసాధారణమైంది. దేశంలో గ్యాస్ కు ఎలాంటి కొరత లేదని ప్రభుత్వం చెబుతున్న సివిల్ సప్లై అధికారులు చేస్తున్న ప్రకటన కేవలం పత్రికలకే పరిమితం అవుతున్నాయి. బహిరంగంగా కమర్షియల్ సిలిండర్ ధరలు పెంచి డీలర్లు దోచుకోవడంతో హోటల్లు, టిఫిన్ సెంటర్లు, కర్రీ పాయింట్లు విపరీతంగా రేట్లు పెంచి ప్రజలను నిలువు దోపిడి చేస్తున్నాయి.

### వ్యాపారుల కష్టాలు, పట్టించుకోని ప్రభుత్వం

కమర్షియల్ ధరలను బ్లాక్ మార్కెట్లో డీలర్లు విపరీతంగా పెంచడంతో హోటళ్లు, చిన్న వ్యాపారులు గ్యాస్‌పై ఆధారపడిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధిక ధరలకు కొనాల్సి రావడంతో వ్యాపారం నష్టాల్లోకి జారుతోంది. "ఇలా కొనసాగితే షాపులు మూసివేయాల్సిందే" అని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవల కమర్షియల్ గ్యాస్ ధరలు బ్లాక్ మార్కెట్లో 5500 పైగా పెరగడంతో చాలా హోటళ్లు, టిఫిన్ సెంటర్ లు, కర్రీ పాయింట్లు, టి పాయింట్లు మూతపడ్డాయి. అయితే కొంతమంది అధిక ధరలు చేసి నడిపిస్తున్నారు.


కానీ ఈ భారం అంతా ప్రజలపై పడడంతో చాలావరకు ప్రజలు హోటళ్లకు పోవాలంటే జరుగుతున్న పరిస్థితి నెలకొన్నది.

### కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల ఆగ్రహం

గ్యాస్ ధరలు పెంచి పెంచి బ్లాక్ మార్కెట్ దందా చేస్తున్న డీలర్లపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోకపోతే పరిస్థితి అదుపు తప్పే అవకాశం ఉంది. గ్యాస్ మాఫియాపై ప్రత్యేక దళాలతో దాడులు చేసి అక్రమాలను అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్ అనేది ప్రజలకు నిత్యావసర వస్తువు. దాన్ని కూడా మాఫియాలు దోపిడీకి గురిచేయడం దురదృష్టకరం. ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వం, ఉన్నత అధికారులు స్పందించి కఠినంగా వ్యవహరించి బ్లాక్ మార్కెట్ దందాను అరికట్టకపోతే ప్రజల ఆగ్రహం ఎప్పుడు ఎటువైపు మళ్లుతుందో చెప్పలేంగా.

# నరకప్రాయంగా మేడ్చల్ బస్ డిపో

- మురుగునీటిలోనే ప్రయాణికుల 'ముళ్ల బాట'
- ఏరులై పారుతున్న మురుగు.. దుర్గంధంతో బెంబేలు
- మురుగునీటిలోనే ప్రయాణికుల నడక
- సోషల్ మీడియా వేదికగా మాజీ కౌన్సిలర్ భర్త నిరసన





మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) ఒకవైపు ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనపై కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. జీహెచ్ఎంసీ మేడ్చల్ సర్కిల్ పరిధిలోని మేడ్చల్ ఆర్టీసీ బస్ డిపో ఆవరణ ప్రస్తుతం మురుగు కాల్వను తలపిస్తోంది. అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహ దారి పైన పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఉంటే అధికారులు నిద్రపోతున్నారా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### ఏరులై పారుతున్న మురుగు.. దుర్గంధంతో బెంబేలు

బస్ డిపో ఆవరణలో డ్రైనేజీ పైపులు పగిలిపోవడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. చిత్రాల్లో కనిపిస్తున్నట్లుగా, డిపో లోపల మరియు ప్రవేశ మార్గాల్లో పెద్ద ఎత్తున నీరు నిలిచిపోయింది. దీంతో ఆ ప్రాంతమంతా బురదమయంగా మారడమే కాకుండా, విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోంది. బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు ముక్కు మూసుకొని గడపాల్సిన పరిస్థితి నెలకొంది. దుర్వాసనకు క్రిములు వ్యాపించి పలు రోగాల బారిన పడే అవకాశం ఉందని అధికారులు ఎందుకింత నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మురుగునీటిలోనే ప్రయాణికుల నడక..

ప్రతిరోజూ వందలాది సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగించే ఈ డిపోలో, కనీసం నడవడానికి కూడా పొడి నేల లేకపోవడం గమనార్హం. చిన్న పిల్లలు, వృద్ధులు ఆ మురుగునీటిలోనే నడుస్తూ బస్సుల దగ్గరకు వెళ్లాల్సి వస్తోంది. ఇది ప్రజారోగ్యానికి తీవ్ర విఘాతం కలిగిస్తోంది. ఈ అపరిశుభ్ర వాతావరణం వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, రోడ్డుపైన నిలవలేని పరిస్థితి ఉందని అధికారులకు ఎందుకు అర్థం కావడంలేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### సోషల్ మీడియా వేదికగా నిరసన..

ఈ ఘోరమైన పరిస్థితిని చూసిన స్థానిక మాజీ కౌన్సిలర్ నడికొప్పు ఉమా భర్త నడికొప్పు నాగరాజు తీవ్రంగా స్పందించారు. ఆయన స్వయంగా డిపో పరిసరాల్లో పర్యటించి, అక్కడి దుస్థితిని వీడియోలు, ఫోటోల ద్వారా సోషల్ మీడియాలో పంచుకున్నారు.

తక్షణమే జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, ఈ మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు. మేడ్చల్ లాంటి కీలకమైన ప్రాంతంలో ఉన్న బస్ డిపో ఇలా అధ్వాన్నంగా మారడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పగిలిన డ్రైనేజీ పైపులను తక్షణమే మరమ్మతు చేసి రోడ్డు మీద నిలిచిన మురుగునీటిని తొలగించి, ఆ ప్రాంతాన్ని శుభ్రపరచాలని కోరారు.

# ఉపాధి హామీ పథకాన్ని కూటమి సర్కార్ నిర్వీర్యం చేస్తోంది

- అవినీతిపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదని విమర్శ



అమరావతి (ప్రశ్న న్యూస్) టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు జీవనాధారమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (ఎంజీఎన్ఆర్ఈజీఏ) ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. దీనివల్ల రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయి, ఆర్థిక వ్యవస్థ కుంటుపడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆదాయాన్ని పెంచడంలో ఉపాధి హామీ పథకం అత్యంత కీలకమని జగన్ పేర్కొన్నారు. చారిత్రకంగా ఈ పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో ఉండేదని, కానీ గత రెండేళ్ల టీడీపీ కూటమి పాలనలో రాష్ట్రం వెనుకబడిపోయిందని విమర్శించారు. ఆమోదించిన లేబర్ బడ్జెట్, పథకం కింద పనిచేసిన కుటుంబాల సంఖ్య, మొత్తం వ్యయం వంటి అన్ని కొలమానాల్లోనూ పనితీరు గణనీయంగా తగ్గిపోయిందని ఆయన వివరించారు. ఈ ప్రభావం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై స్పష్టంగా కనిపిస్తోందని జగన్ తెలిపారు. గత రెండేళ్లుగా జీఎస్టీ, అమ్మకం పన్ను వసూళ్లు మందగించడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. "టీడీపీ కూటమి ప్రభుత్వం అవినీతి, సంపదపై ఉన్న యావతోనే నిమగ్నమై ఉంది. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టే సమయం వారికి లేదు" అని జగన్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తన ప్రాధాన్యతలను మార్చుకొని, ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు.

# రేవంత్ రెడ్డి పాలన పోవాలనేది ప్రజల కోరిక

- రేవంత్ సీమాంధ్ర నేతల చేతుల్లో కీలుబొమ్మ అన్న జీవన్ రెడ్డి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రా నాయకులకు తొత్తుగా మారిపోయారని నిన్న బీఆర్ఎస్ పార్టీలో చేరిన జగిత్యాల సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి విమర్శించారు. ఆయన మొదటి నుంచి సీమాంధ్ర నాయకుల చేతిలో కీలుబొమ్మగానే ఉంటున్నారని అన్నారు. 2015లో నాటి టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే కుట్రతో, వేం నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీగా చేయాలనే ఉద్దేశంతో ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి దొరికిపోయారని పేర్కొన్నారు. ఆయనకు రాజ్యాంగం పట్ల గౌరవం లేదని విమర్శించారు. ఆయన ఆంధ్రా తొత్తులా మారి పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సహకరిస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలన పోయి కేసీఆర్ పాలన రావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. మేం పాలన మార్పు కోరుకున్నాం తప్ప, భౌతికంగా రేవంత్ రెడ్డి కీడును తాము కోరుకోలేదని అన్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యారంటే అది కేసీఆర్ పుణ్యమే అన్నారు. కేసీఆర్ ఉద్యమించకుంటే తెలంగాణ వచ్చేదా అని ప్రశ్నించారు. అలాంటి ఉద్యమనాయకుడిని పట్టుకుని ఉరితీస్తానని అంటావా అని ప్రశ్నించారు. జగిత్యాలలో కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ సమయంలోనే రేవంత్ రెడ్డి కావాలని మేడిగడ్డ పర్యటనను పెట్టుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదని, కానీ రేవంత్ రెడ్డి తానే ఎప్పటికీ ముఖ్యమంత్రిగా ఉంటానని చెబుతున్నాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అన్నీ గమనిస్తోందని తెలిపారు. రేవంత్ రెడ్డి ఇప్పటికే బీజేపీలో చేరారని... ఎన్డీఏకు, రేవంత్ రెడ్డికి మధ్య చంద్రబాబు వారధిగా ఉన్నారని అన్నారు. తనను చంద్రబాబు కాపాడుతారని ఆయన భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ అధిష్ఠానం ఎందుకు మౌనంగా ఉందో అర్థం కావడంలేదని అన్నారు. నాదెండ్ల భాస్కరరావు అంశం గురించి రేవంత్ రెడ్డి తెలియకుండా మాట్లాడుతున్నారని జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాడు నాదెండ్ల భాస్కరరావుకు కాంగ్రెస్ పార్టీ మద్దతుగా నిలిచిందని గుర్తు చేశారు. ఆయనకు మద్దతుగా తాను మంత్రి పదవికి రాజీనామా చేశానని వెల్లడించారు. తనను ఎవరూ తొలగించలేదని, తనంతట తానే రాజీనామా చేశానని అన్నారు. తనతో పాటు ఇందిరాగాంధీ, కాంగ్రెస్ సహా అందరూ నాదెండ్లకు మద్దతుగా నిలిచారని వెల్లడించారు. ఈ విషయం రేవంత్ రెడ్డికి తెలియదేమో అని విమర్శించారు.

# కూటమి నేతల ప్రకటనలు సముచితంగా లేవు

- చంద్రబాబుకు తెలంగాణ మంత్రి పొన్నం లేఖ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ – తెలంగాణ రాష్ట్రాల విభజన అంశం మళ్ళీ తెరపైకి వచ్చింది. ఈ అంశానికి సంబంధించి తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ఏపీ సీఎం చంద్రబాబుకి లేఖ రాశారు. రాష్ట్ర విభజనపై ఇటీవల కొందరు నేతలు చేస్తున్న వ్యాఖ్యలు రెండు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టేలా ఉన్నాయని లేఖలో పొన్నం ఆందోళన వ్యక్తం చేశారు. విభజనను తప్పుబడుతూ టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు చేస్తున్న ప్రకటనలు సముచితంగా లేవని... ఇవి ప్రజల మధ్య విద్వేషాలను రగిలించే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా, లోక్‌సభలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య రాష్ట్ర విభజనపై చేసిన వ్యాఖ్యలను పొన్నం ప్రభాకర్ తీవ్రంగా తప్పుబట్టారు. ఆ వ్యాఖ్యలను లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించేలా చంద్రబాబు చొరవ తీసుకోవాలని, ఈ మేరకు స్పీకర్‌కు లేఖ రాయాలని కోరారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న చంద్రబాబు, తన మిత్రపక్ష నేతలకు సర్దిచెప్పి ఇలాంటి సున్నితమైన అంశాలపై బాధ్యతాయుతంగా వ్యవహరించేలా చూడాలని అన్నారు. రాష్ట్రం విడిపోయి దశాబ్ద కాలం గడిచినా, ఇంకా పాత గాయాలను రేపేలా మాట్లాడటం వల్ల ఎవరికీ ప్రయోజనం లేదని మంత్రి స్పష్టం చేశారు. "రెండు రాష్ట్రాలు పాత విభేదాలను పక్కనపెట్టి, పరస్పర సహకారంతో అభివృద్ధి పథంలో సాగడం తక్షణ అవసరం" అని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. చంద్రబాబు తన వినతిని అర్థం చేసుకుని, సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers".
H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588